ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తిరుపతి
జిల్లా వార్తలు
మంగళవారం 23 ఏప్రిల్ 2024



నామినేషన్ వేసేందుకు ప్రదర్శనగా వస్తున్న తిరుపతి పార్లమెంటు బీజేపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద్‌తో జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు తదితరులు



నాలుగో రోజు 42 నామినేషన్లు

పార్లమెంటుకు ఐదు... అసెంబ్లీకి 37 దాఖలు

తిరుపతి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లావ్యాప్తంగా సోమవారం 42 నామినేషన్లు దాఖలయ్యాయి.తిరుపతి పార్లమెంటుకు బీజేపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద్, వైసీపీ అభ్యర్థి మద్దిల గురుమూర్తి నామినేషన్లు వేశారు. అలాగే అసెంబ్లీ స్థానాలకు సంబంధించి చంద్రగిరి నుంచీ టీడీపీ అభ్యర్థి పులివర్తి వెంకటమణిప్రసాద్ అలియాస్ పులివర్తి నానీ, కాంగ్రెస్ అభ్యర్థి శ్రీనివాసులు అలియాస్ వాసు నామినేషన్లు వేశారు. సత్యవేడు నుంచీ టీడీపీ అభ్యర్థి కోనేటి ఆదిమూలం, కాంగ్రెస్ అభ్యర్థి బాలగురవం బాబు , సూళ్ళూరుపేట నుంచీ వైసీపీ అభ్యర్థి కిలివేటి సంజీవయ్య ,గూడూరు నుంచీ టీడీపీ అభ్యర్థి పాశం సునీల్ కుమార్, కాంగ్రెస్ అభ్యర్థి చిల్లకూరు వేమయ్య,వెంకటగిరి నుంచీ కాంగ్రెస్ అభ్యర్థి పంటా శ్రీనివాసులురెడ్డి నామినేషన్లు దాఖలు చేశారు.

ఇతర పార్టీలు, స్వతంత్రుల తరపున...

తిరుపతి పార్లమెంటుకు వైసీపీ అభ్యర్థి మద్దిల గురుమూర్తి సతీమణి నవ్య కిరణ్ వైసీపీ డమ్మీ అభ్యర్థిగా నామినేషన్ వేశారు.జై హిందుస్థాన్ పార్టీ తరపున అక్కిలిగుంట మధు, జనతా కాంగ్రెస్ పార్టీ తరపున ఉమాదేవి నామినేషన్లు సమర్పించారు.తిరుపతి అసెంబ్లీకి బీఎస్పీ తరపున జే.వేణుగోపాలరాజు, జై హిందూస్థాన్ పార్టీ తరపున ఎం.నీలకంఠ, ఇండిపెండెంట్లుగా అక్కిపల్లి మునికృష్ణయ్య, బ్యాంగి నవీన్ వున్నారు. చంద్రగిరికి పది మంది నామినేషన్లు వేయగా వారిలో నవ భారత నిర్మాణ సేవా పార్టీ తరపున పి.విశ్వనాథరెడ్డి, టీడీపీ డమ్మీ అభ్యర్థిగా కె.గానసుధ అలియాస్ పులివర్తి సుధారెడ్డి, జై హిందూస్థాన్ పార్టీ నుంచీ ఎం.నీలకంఠ, జాతీయ చేతివృత్తుల ఐక్య వేదిక పార్టీ నుంచీ ఎల్.ప్రసాద్, జై భారత్ నేషనల్ పార్టీ నుంచీ తురక అమరనాధ్, జనతా కాంగ్రెస్ పార్టీ నుంచీ ఎం.ఉమాదేవి, ఇండిపెండెంట్లుగా కె.రాము, కె.సాయిచంద్రిక వున్నారు. సత్యవేడుకు నలుగురు నామినేషన్లు దాఖలు చేయగా వారిలో ఇండిపెండెంట్లు వేంపల్లి కృష్ణారావు, సి.సుప్రియ వున్నారు. శ్రీకాళహస్తికి ఆరుగురు నామినేషన్లు వేయగా అందులో బీఎస్పీ తరపున కుంట్రపాకు సురేంద్రబాబు, కుంట్రపాకు మునీశ్వర్, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా తరపున అక్కిరాల పావని, జై భారత్ నేషనల్ పార్టీ నుంచీ రొమ్మాల నిరంజన్‌రెడ్డి, ఇండిపెండెంట్లుగా వి.నాగరాజనాయుడు,వి.రమేష్ వున్నారు. సూళ్ళూరుపేటలో ఐదుగురు నామినేషన్లు ఫైల్ చేయగా లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ తరపున కందాటి రజనీకాంత్, వైసీపీ డమ్మీ అభ్యర్థిగా కిలివేటి సుభాషిణి, బీఎస్పీ తరపున తొప్పాని రమణయ్య, ఇండిపెండెంటుగా నిడిగుంట అరుణ నామినేషన్లు సమర్పించారు. గూడూరులో టీడీపీ డమ్మీ అభ్యర్థులుగా పాశం జశ్వంత్ కుమార్, గోనె సంధ్యారాణి, పాశం సురేష్ కుమార్, పిరమిడ్ పార్టీ తరపున డి.పోలమ్మ, ఇండిపెండెంటుగా కమతం కామాక్షి నామినేషన్లు సమర్పించారు.



స్వర్ణరథంలో శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి



స్వర్ణరథంలో మలయప్ప విహారం

తిరుమల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి):శ్రీవారి వసంతోత్సవాల్లో భాగంగా తిరుమల వసంతమండపంలో సోమవారం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామికి స్నపన తిరుమంజనం కన్నులపండువగా జరిగింది. మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 4గంటల వరకు ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహించారు.పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంతో అభిషేకం చేశారు. తర్వాత స్వామి అమ్మవార్లు ఊరేగింపుగా శ్రీవారి ఆలయానికి చేరుకున్నారు. కాగా సోమవారం ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి తిరుమాడవీధుల్లో స్వర్ణరథంపై విహరించారు. ఉదయం 8 నుంచి 10 గంటల వరకు జరిగిన ఈ స్వర్ణరథోత్సవంలో భక్తులు పాల్గొని గోవిందనామాలు, కర్పూర హారతులతో ఉత్సవమూర్తుల కటాక్షాన్ని అందుకున్నారు.మంగళవారం శ్రీభూదేవి సమేత మలయప్పస్వామితో పాటు రుక్మిణి సమేత శ్రీకృష్ణస్వామి, సీతారామలక్ష్మణ సమేత అంజనేయస్వామి ఉత్సవమూర్తులను కూడా వసంత మండపంలో కొలువుదీర్చి స్నపన తిరుమంజనం నిర్వహించనున్నారు.

పది ఫలితాల్లో 10వ స్థానం



- గత ఏడాదితో పోల్చితే రెండు స్థానాలు కిందికి
- ఉత్తీర్ణత శాతంలో 15.01 శాతం వృద్ధి
- 91.96శాతం ఉత్తీర్ణతతో బాలికల పైచేయి

మేనేజ్‌మెంట్ల వారీగా ఉత్తీర్ణత శాతం

ఏపీ మోడల్ స్కూల్స్	96.03
ఏపీఆర్ఈఐఎస్ స్కూల్స్	98.77,
ఏపీఎస్‌డబ్ల్యుఆర్‌ఎస్	95.60
ఏపీటీడబ్ల్యుఆర్	83.97
కేజీబీవీ స్కూల్స్	85.79,
ఎంజేపీఏపీ బీసీ వెల్ఫేర్ పాఠశాలలు	99.75
మున్సిపల్ పాఠశాలలు	81.22
ప్రైవేట్ ఎయిడెడ్ స్కూల్స్	90.78
ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ స్కూల్స్	98.39
ప్రభుత్వ పాఠశాలలు	82.26
జడ్పీ పాఠశాలలు	83.56

మండలాల వారీగా ఉత్తీర్ణత శాతం

ఎర్రావారిపాళెం	98.08
తిరుపతి అర్బన్	95.97
నాగలాపురం	95.73
కేవీబీ పురం	95.09
పిచ్చాటూరు	94.02
సత్యవేడు	93.45
డక్కిలి	93.15
శ్రీకాళహస్తి	92.53
పుత్తూరు	92.44
చంద్రగిరి	92.51
చిన్నగొట్టిగల్లు	92.42
బీఎన్ కండ్రిగ	92.24
ఆర్సీపురం	91.64
ఏర్పేడు	91.58
వడమాలపేట	91.27
కోట	90.73
పాకాల	90.59
వరదయ్యపాళెం	90.31
చిట్టమూరు	89.53
రేణిగుంట	88.94
చిల్లకూరు	88
గూడూరు	87.55
వాకాడు	87.50
తిరుపతి రూరల్	87.35
ఓజిలి	87.17
తొట్టంబేడు	86.88
సూళ్లూరుపేట	85.47
వెంకటగిరి	85.02
నాయుడుపేట	84.62
పెళ్లకూరు	84.02
బాలాయపల్లి	81.86
నారాయణవనం	81.50
దొరవారిసత్రం	75.79
తడ	69.94



కె.పాంచజన్య,డీవీసత్రం గురుకుల పాఠశాల | ధార్మి, తిరుచానూరు | శ్రీవర్షిత, గూడూరు | టి.పవన్, కోట గురుకుల పాఠశాల | జనని, బండారుపల్లి, ఏర్పేడు మండలం | సాయికిషోర్, మేనకూరు జడ్పీ హైస్కూల్, నాయుడుపేట | చారుమతి, కేవీబీపురం మోడల్ స్కూల్, పిచ్చాటూరు | కె.చిన్మయి, చంద్రగిరి హైస్కూల్

తిరుపతి(విద్య), ఏప్రిల్ 22: పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో ఈ ఏడాది జిల్లా 10వ స్థానంలో నిలిచింది. గతేడాదిలో 75.70శాతం ఉత్తీర్ణతతో 8వస్థానంలో నిలిచిన జిల్లా..ఈ ఏడాది 90.07శాతం ఉత్తీర్ణత సాధించినా పదవస్థానానికి దిగజారింది.బాలుర కన్నా బాలికలు 2.38శాతం అధిక ఉత్తీర్ణత సాధించి తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించారు. రెగ్యులర్ విభాగంలో 13,997మంది బాలురకు 12,538మంది పాసై 89.58శాతం ఉత్తీర్ణత, 12,628మంది బాలికలకు 11,613మంది పాసై 91.96శాతం ఉత్తీర్ణత నమోదు చేశారు. మొత్తం 26,625మంది విద్యార్థుల్లో 24,151మంది పాసై 90.71శాతం ఉత్తీర్ణత సాధించారని డీఈవో శేఖర్ వెల్లడించారు.వీరిలో 20,161 మంది ప్రథమ శ్రేణి, 2,694 మంది ద్వితీయ శ్రేణి, 1,293 మంది తృతీయశ్రేణిలో పాసయ్యారు. జిల్లాలో 204 పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత సాధించగా ఎర్రావారిపాళెం మండలం 98.08 ఉత్తీర్ణతతో అత్యధిక శాతం ఉత్తీర్ణత నమోదు చేయగా ఆరు జడ్పీ హైస్కూళ్లు వందశాతం ఫలితాలు సాధించాయి.తడ మండలం 69.94శాతం అత్యల్ప ఉత్తీర్ణత నమోదు చేసిందని వివరించారు. ఎంజేపీఏపీ బీసీ వెల్ఫేర్ పాఠశాలలు అత్యధికంగా 99.75 ఉత్తీర్ణతను సాధించాయని తెలిపారు. ఇక సబ్జెక్టుల వారీగా చూస్తే తెలుగులో 95.74, హిందీలో 98.54, ఇంగ్లీషులో 97.83, గణితంలో 94.65, జనరల్ సైన్స్‌లో 93.28, సోషల్ స్టడీస్‌లో 95.54 ఉత్తీర్ణత శాతం నమోదైందన్నారు.

ప్రభుత్వ స్కూళ్లలో టాపర్లు:

కె. లక్ష్మీప్రియ (ఎస్ఎస్‌బీ మున్సిపల్ హైస్కూల్, శ్రీకాళహస్తి) 596 మార్కులు, కె. పాంచజన్య (ఎంజేపీఏపీ బీసీ వెల్ఫేర్ బాలుర పాఠశాల, దొరవారి సత్రం) 595, టి. పవన్ (ఎంజేపీఏపీ బీసీ వెల్ఫేర్ బాలుర పాఠశాల, కోట) 593, బి. జనని (జడ్పీ హైస్కూల్, బండారుపల్లె, ఏర్పేడు) 592, ఎన్.సాయికిషోర్ (జడ్పీ హైస్కూల్, మేనకూరు, నాయుడుపేట) 591, కె. చారుమతి (ఏపీ మోడల్ స్కూల్, కేవీబీ పురం) 590, ఎస్ కస్తూరి (జడ్పీ బాలికల హైస్కూల్, నారాయణవనం) 590, జి.యోగేష్ (జడ్పీ హైస్కూల్, తొండమనాడు, శ్రీకాళహస్తి) 590, జి.లక్ష్మణ్ (మున్సిపల్ హైస్కూల్, ఆర్ఎస్ మాడ వీధి, తిరుపతి) 590, ఏహెచ్ తౌఫిక (జడ్పీ బాలికల హైస్కూల్, నారాయణవనం) 589, సి.అభిలాష్ (జడ్పీ హైస్కూల్, తొండమనాడు, శ్రీకాళహస్తి) 589, కె.తులసి (ఏపీఎస్‌డబ్ల్యుఆర్‌ఈఎస్‌జీఎస్, కాసా గార్డెన్, శ్రీకాళహస్తి) 589, ఎస్.తరుణ్‌కుమార్ (ఎన్వీ హైస్కూల్, తిరుపతి) 589, బి.పల్లవి (జడ్పీ హైస్కూల్, వరదయ్యపాళెం) 589, కె.మునికుమార్ (జడ్పీ హైస్కూల్, వల్లివేడు, వెంకటగిరి) 589మార్కులు.

నేటినుంచి వెరిఫికేషన్, రీకౌంటింగ్‌కు దరఖాస్తులు

రీ వెరిఫికేషన్, రీ కౌంటింగ్‌కు మంగళవారం నుంచి మే 30వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని డీఈవో శేఖర్ తెలిపారు.విద్యార్థులు ఆన్‌లైన్ విధానంలో మాత్రమే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని, పాఠశాలల ప్రధానోపాధ్యాయులను కలిసి వారిద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. సంబంధిత ఫీజులుకూడా ఆన్‌లైన్ అప్లికేషన్‌లో మాత్రమే చెల్లించాల్సి ఉంటుందన్నారు.ఆన్‌లైన్ ఫారం పూర్తి చేసేందుకు... 2024 మార్చి ఎస్ఎస్‌సీ పబ్లిక్ పరీక్షలకు హాజరైన పాఠశాల నుంచి విద్యార్థుల జాబితా, రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ చేయాలనుకుంటున్న సబ్జెక్టులు, పేపర్ల వివరాలు, విద్యార్థుల తల్లిదండ్రుల మొబైల్ నంబరు, తల్లిదండ్రుల ఈమెయిల్ ఐడీ సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. డెబిట్, క్రెడిట్ కార్డులు, ఇంటర్నెట్ బ్యాంకింగ్, యూపీఐ ద్వారా రుసుము చెల్లించాల్సి ఉంటుందని, ప్రతి జవాబు స్క్రిప్ట్ రీకౌంటింగ్‌కు రూ. 500, ప్రతి సబ్జెక్టు స్క్రిప్ట్ రీ వెరిఫికేషన్‌కు రూ. 1000 చెల్లించాల్సి ఉంటుందని డీఈవో వివరించారు.

గుండెకు, ఊపిరితిత్తులకు

మధ్యలో బుల్లెట్లు

- ఆపరేషన్ చేసి ప్రాణాలు కాపాడిన రుయా వైద్యులు

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 22: గుండెకు, ఊపిరితిత్తులకు మధ్యలో శరీరంలోకి రెండు బుల్లెట్లు దిగిన ఓ వ్యక్తి ప్రాణాలను అరుదైన శస్త్రచికిత్సతో తిరుపతిలోని రుయాస్పత్రి వైద్యులు కాపాడారు. ఆ వివరాలను సోమవారం ఆస్పత్రి సూపరింటెండెంట్ రవిప్రభు మీడియాకు తెలిపారు. అన్నమయ్య జిల్లా రాయచోటి మండలం పసలవాండ్లపల్లికి చెందిన విశ్వనాథ్(38)పై కుటుంబ కలహాలతో సొంత అన్న నాటు తుపాకీతో కాల్పులు జరిపాడు. దీంతో విశ్వనాథ్ శరీరంలోకి రెండు బుల్లెట్లు దూసుకెళ్లాయి. బాధితుడిని కుటుంబీకులు ఈనెల 18వ తేదీన రుయాస్పత్రికి తీసుకొచ్చారు. వైద్యులు పరీక్షించగా.. గుండెకు, ఊపిరితిత్తులకు మధ్యలో రెండు బుల్లెట్లు ఉన్నాయని గుర్తించారు. వెంటనే కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ కళ్యాణి రమ ఆధ్వర్యంలో ఆధునిక పెరికాడియంలో పద్ధతిలో శస్త్రచికిత్స చేసి బుల్లెట్లను తొలగించారు. బాధితుడు పూర్తి ఆరోగ్యంగా కోలుకున్నాడు. ఇటువంటి సర్జరీ చేయడం సాధారణం విషయం కాదని, బుల్లెట్లను తొలగించే క్రమంలో ఒక్కోసారి రోగి ప్రాణాలు కూడా కోల్పోయే అవకాశం ఉందని సూపరింటెండెంట్ తెలిపారు. ఏఆర్ఎంవో డాక్టర్ హరికృష్ణ, నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-1 అరుణమ్మ, క్లినికల్ పర్యూజనిస్టు చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



విశ్వనాథ్‌ను పరీక్షిస్తున్న వైద్యాధికారులు

కోత, కుట్లు లేకుండా వెరికోస్ వెయిన్ శస్త్ర చికిత్స

కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా రుయాస్పత్రిలో కోత, కుట్లు లేకుండా తొలిసారిగా వెరికోస్ వెయిన్ శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు సూపరింటెండెంట్ తెలిపారు. రెండ్రోజుల కిందట రాయచోటి రాయుడు కాలనీకి చెందిన వెంకట్రమణ(51) అనే వ్యక్తి వెరికోస్ వెయిన్‌తో బాధపడుతూ రుయాస్పత్రికి వచ్చాడు. వైద్యపరీక్షలు చేశాక కార్డియో థొరాసిక్ సర్జన్ డాక్టర్ కళ్యాణి రమ, డాక్టర్ రాధా ఆధ్వర్యంలో రేడియో ఫ్రీక్వెన్సీ ఎబులేషన్ ఫామ్ స్క్లీరో థెరపీ(ఆర్ఎఫ్ఏ) పద్ధతిలో ఎటువంటి కోత, కుట్లు లేకుండా శస్త్ర చికిత్స విజయవంతంగా నిర్వహించారని రవిప్రభు వివరించారు.

ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న టీచర్ సస్పెన్షన్

నగరి ఏప్రిల్ 22 : ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఓ టీచర్ సస్పెండయ్యారు.నగరి దళితవాడ ప్రాథమిక పాఠశాలలో పనిచేసే చంద్రారెడ్డి ఈ నెల 8వ తేదీన కీళపట్టులో మంత్రి రోజా భర్త సెల్వమణితో కలిసి ప్రచార కార్యక్రమంలో పాల్గొనడంతో మీడియాలో కథనాలు వెలువడ్డాయి.ఈ విషయమై స్పందించిన చిత్తూరు జిల్లా విద్యాశాఖాధికారి ఇటీవల చంద్రారెడ్డిని సస్పెండ్ చేశారు.

పూడి- ఏర్పేడు మధ్య నూతన రైలుమార్గం



తిరుపతి సెంట్రల్, ఏప్రిల్ 22: పూడి- ఏర్పేడు రైల్వేస్టేషన్ల మధ్య నూతన రైలు మార్గం ఏర్పాటు చేయడానికి రైల్వే బోర్డు చర్యలు ప్రారంభించింది. దక్షిణ భారతదేశం నుంచి ఉత్తర భారతదేశంలోని ప్రధాన నగరాలకు తక్కువ సమయంలో వస్తు రవాణా చేయడానికి రైల్వే బోర్డు ఈ నూతన మార్గాన్ని వేయడానికి నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం వస్తు రవాణా చేసే గూడ్స్ రైళ్ల పూడి నుంచి రేణిగుంట రైల్వే జంక్షన్‌కు చేరుకుంటాయి. అక్కడి నుంచి ముంబాయి, విజయవాడ మార్గాలవైపు వెళతాయి. సదరన్ రైల్వే నుంచి ఉత్తర భారత దేశంలోని ప్రధాన నగరాలకు వస్తు రవాణా చేయడానికి రేణిగుంట రైల్వే జంక్షన్‌లో కొంత ఆలస్యం జరుగుతోందని రైల్వే బోర్డు అధ్యయనం చేసింది. ఈ మార్గంలో గూడ్స్ రైళ్లతో పాటు సూపర్ ఫాస్ట్ రైళ్లు కూడా రాకపోకలు నిర్వహించే అవకాశం ఉంటుందని అధికారులు గుర్తించారు. రైల్వే నిబంధనల మేరకు ప్రాథమిక సర్వే నిర్వహించారు. పూడి నుంచి ఏర్పేడు రైల్వేస్టేషన్ వరకు 27 కిలోమీటర్ల దూరం సర్వే చేసినట్లు సమాచారం. ఈ మార్గంలో ఒక రైల్వేస్టేషన్ కూడా వస్తుంది. ఈ రైలు మార్గం పూర్తిచేస్తే రేణిగుంట రైల్వే జంక్షన్‌లో జరుగుతున్న ఆలస్యాన్ని నివారించవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. మరోవైపు రేణిగుంట రైల్వే జంక్షన్‌పై రైళ్ల రాకపోకల ఒత్తిడీ తగ్గే అవకాశాలున్నాయి. ఈప్రాంతం నుంచి రైతులు పండించే వస్తువులు కూడా దూర ప్రాంతాలకు రవాణా చేసే అవకాశం ఏర్పడనుంది. అలాగే రేణిగుంట, ఏర్పేడు మండలాల్లోని భారీ పరిశ్రమల ఉత్పత్తులు కూడా రవాణా చేయడానికి అనుకూలంగా ఉంటుంది.

కూలిన తిరుచానూరు వంతెన సంగతేంటి..?


మాట్లాడుతున్న పులివర్తి సుధారెడ్డి

తిరుచానూరు, ఏప్రిల్ 22: తిరుచానూరు వంతెన కూలిపోయి సంవత్సరాలు గడుస్తున్నా.. జనం ఇబ్బందులను మాత్రం ఎమ్మెల్యే చెవిరెడ్డి పట్టించుకోవడం లేదని చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని సతీమణి సుధారెడ్డి విమర్శించారు. సోమవారం తిరుపతి రూరల్ మండలం ముండ్లపూడి పంచాయతీలో మహిళలతో కలిసి మహిళా శక్తికి అండగా కార్యక్రమాన్ని నిర్వహించారు. మూడు నెలల క్రితం వచ్చిన వర్షంతో ఇబ్బంది పడినవారికి నిత్యావసర సరుకులు, దుప్పట్లను పులివర్తి నాని అందించారని గుర్తు చేశారు. దీనికితోడు చెవిరెడ్డి కనుసన్నల్లో గంజాయి ముఠాలు తమ వ్యాపారాలను యథేచ్ఛగా కొనసాగిస్తున్నారని ఆరోపించారు.

ఓటేరులో వైసీపీ నేతలు టీడీపీలో చేరిక



తిరుపతి రూరల్, ఏప్రిల్ 22: తిరుపతి రూరల్ మండలంలోని ఓటేరు పంచాయతీల్లో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని తనయుడు వినీల్ సోమవారం ప్రచారం నిర్వహించారు. వినీల్ సమక్షంలో సర్పంచ్ లక్ష్మీరాజా మరిది రమేష్‌తోపాటు నాయకులు రాజా, లక్ష్మీ, గోపాల్, ప్రభాకర్, రాజేశ్వరి, కుప్పమ్మ, రూప, మునెమ్మ, కుమార్, శ్రీను, సహదేవన్, ప్రకాశ్, సూర్య తదితరులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి వినీల్ సాదరస్వాగతం పలికి పసుపు కండువాలు కప్పారు. నానీ గెలుపునకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామని చెప్పారు.

ఆకట్టుకున్న గరికపాటి ప్రవచనం

తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 22: తిరుపతి అన్నమాచార్య కళామందిరంలో శ్రీరామనవమిని పురస్కరించుకుని గరికపాటి రమేష్ ప్రవచనం జరుగుతోంది. రామాయణంలోని ఘట్టాలను రమేష్ ఆసక్తికరంగా వివరిస్తున్న తీరు ప్రేక్షలను ఆకట్టుకుంటోంది. చివరగా ప్రవచనకర్తను రాయలసీమ రంగస్థలి అధ్యక్షుడు గోపీనాథ్‌రెడ్డి శాలువతో సత్కరించారు.

చంద్రగిరి

టెన్త్ ఫలితాల్లో సత్తాచాటిన
ప్రభుత్వ బడులు

ఎర్రావారిపాలెం, ఏప్రిల్ 22: మండలంలో బోడేవాండ్ల పల్లె, కేజీబీవీ పాఠశాల, ఏపీఎంఎస్ పాఠశాల వీఆర్ అగ్రహారం, కోటకాడపల్లె, రెడ్డివారిపల్లె, పచ్చార్లావాండ్లపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు వంద శాతం ఫలితాలు సాధించాయి. బోడేవాండ్లపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని ఎన్.పవిత్ర 576మార్కులతో మండల టాపర్‌గా నిలిచారు.

చంద్రగిరి: మండలంలోని కొటాల, ఎ.రంగంపేట, ఎంజేపీఏపీబీసీడబ్ల్యూ పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత సాధించాయని ఎంఈవోలు లలితకుమారి, భాస్కర్‌బాబులు తెలిపారు.

తిరుమల, ఆంధ్రజ్యోతి: పదో తరగతి ఫలితాల్లో తిరుమలలోని శ్రీవేంకటేశ్వర ఉన్నత పాఠశాలలో మొత్తం 42మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, అందరూ పాసయ్యారు. మోనిష 581, హేమశ్రీ 568, రేణుశ్రీ కీర్తి 529 మార్కులు సాధించారు. ప్రస్తుతం రేమాండ్స్ సంస్థ సహకారంతో తిరుమల ఎస్వీ ఉన్నత పాఠశాలను టీటీడీ నిర్వహిస్తోంది.

కళాకారులకు సన్మానం

మంగళం, ఏప్రిల్ 22: శ్రీరామనవమి పర్వదినాలలో భాగంగా మన సంస్కృతి కళాసంస్థ అధ్యక్షుడు రంగాని సహదేవ నాయుడు, కార్యదర్శి కలకట రెడ్డెప్ప ఆధ్వర్యంలో సోమవారం పలువురు కళాకారులను సన్మానించారు. అంతకుముందు జీవకోనలో వెలసిన శ్రీరాములవారి ఆలయంలో హార్మోనిస్ట్ ఆమూరు సుబ్రహ్మణ్యం, తబలిస్ట్ సీతారామయ్య, శాంబోల హరినాథ్, జీను రాజశేఖర్, గురుస్వామి, కుసుమకుమారి, విజయలక్ష్మి, నాగమణి, సుజాత, సంగీత కళాశాల ఉపాధ్యాయులు వెంకటేశులు, డాక్టర్ రవిబాబు, రుక్మిణీరెడ్డి భక్తిగీతాలు, భజనలతో అలరించారు.

తెప్పలపై కోదండరాముడి విహారం



తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 22: తిరుపతి కోదండరాముడి తెప్పోత్సవాలలో భాగంగా సోమవారం ఉదయం 8 నుంచి 9.30 గంటల వరకు ఆలయంలోని మండపంలో స్వామివారికి శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం 7 నుంచి రాత్రి 8.30 గంటల వరకు సీతారాముల ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా రామచంద్ర పుష్కరిణికి తీసుకొచ్చారు. రెండోరోజు స్వామివారు ఏడు చుట్లు తిరిగి భక్తులకు కనువిందు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో పార్థసారథి, సూపరింటెండెంట్ సోమశేఖర్, ఇతర అధికారులు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కన్నులపండువగా ఊంజల్ సేవ



చంద్రగిరి, ఏప్రిల్ 22: చంద్రగిరిలోని కోదండ రామాలయం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం స్వామివారి ఉత్సవమూర్తిని పాండురంగ స్వామిగా అలంకరించి కన్నుల పండువగా ఊంజల్ సేవ నిర్వహించారు. ఆలయ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ మునిహరిబాబు, అర్చకులు శ్రీనివాసభట్టర్, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ బూత్‌లను పరిశీలించిన ఎస్పీ



రామచంద్రాపురం, ఏప్రిల్ 22: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రామచంద్రాపురంలోని సమస్యాత్మక పోలింగ్ బూత్‌లను సోమవారం తిరుపతి ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండలంలోని కొత్తకండ్రిగ, కమ్మపల్లి, వెంకటరామాపురం పోలింగ్ బూత్‌ను పరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు భాస్కర్‌రెడ్డి, శరత్‌రాజ్‌కుమార్, చంద్రగిరి సీఐ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ ఫలితాల్లో 'ప్రైవేటు' ప్రతిభ

తిరుపతి(విద్య), ఏప్రిల్ 22: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో తిరుపతిలోని పలు ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ప్రతిభ చాటారు. అత్యుత్తమ ఫలితాలు సాధించారని పాఠశాలల యాజమాన్యాలు పేర్కొన్నాయి.

● మాతృశ్రీ స్కూల్‌లో..


విద్యార్థులతో చైర్మన్ డాక్టర్ సుధాకర్‌నాయుడు, టీచర్లు

రైల్వే కాలనీలోని మాతృశ్రీ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని చైర్మన్ డాక్టర్ కె.సుధాకర్‌నాయుడు తెలిపారు. కె.నందకిషోర్ 594 మార్కులతో టాపర్‌గా నిలువగా పరీక్షకు హాజరైన 66 మంది విద్యార్థులు పాసై వందశాతం ఉత్తీర్ణత నమోదుచేశారని చెప్పారు. 44 మంది విద్యార్థులకు 500కుపైగా మార్కులు సాధించగా, గణితంలో ఐదుగురు, సైన్స్‌లో ముగ్గురు, తెలుగులో ఆరుగురు, సోషల్‌లో ఒకరు వందకు వంద మార్కులు సాధించారని వివరించారు.

● 'గౌతమ్' స్కూల్‌లో..


విద్యార్థులతో డైరెక్టర్ డాక్టర్ వై.శ్రీనివాస్

న్యూబాలాజీ కాలనీలోని గౌతమ్ టాలెంట్, ఐఐటీ ఒలంపియాడ్ స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించారని డైరెక్టర్ డాక్టర్ యాళ్ల శ్రీనివాస్ తెలిపారు. పి.హేమశ్రీ 595, కె.సుహాన 591, ఎ.లీనాశ్రీ 590 మార్కులతోపాటు వందశాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. 75 మంది విద్యార్థులు 500లకుపైగా, 50 మంది 550కి పైగా, 29 మంది 570కిపైగా, 10 మంది 580కిపైగా, ముగ్గురు 590పైగా మార్కులు సాధించారని వెల్లడించారు.

● 'రెడ్ చెర్రీస్' స్కూల్‌లో..


విద్యార్థులతో డైరెక్టర్ సునీల్‌కుమార్‌రెడ్డి

రెడ్ చెర్రీస్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని డైరెక్టర్ సునీల్ కుమార్‌రెడ్డి తెలిపారు. బి.ధన్యశ్రీ 595, ఇ.జాహ్నవి 594, కేవీ చైతన్య 593, వి.మౌనీష్, ఎ.అనూష, ఎస్.ప్రియవర్షిణి 591 మార్కులతోపాటు వందశాతం ఉత్తీర్ణత సాధించామన్నారు. 177 మంది విద్యార్థులకుగాను 134 మందికి 500కుపైగా మార్కులు వచ్చాయన్నారు.

● 'ప్రభాత్' స్కూల్‌లో..



భవానీ నగర్‌లోని ప్రభాత్ హైస్కూలు విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించారని హెచ్‌ఎం డాక్టర్ వి.జ్యోతి తెలిపారు. కీర్తన 589, తరుణ్‌కుమార్‌రెడ్డి 578, భువన కృతి 565, జశ్వంత్ 556, పవన్‌సాయి 547 మార్కులు సాధించారన్నారు

● 'లిటిల్ ఏంజల్స్' స్కూల్‌లో..


విద్యార్థులతో చైర్‌పర్సన్ రమాదేవి

కేశవాయనగుంటలోని లిటిల్ ఏంజల్స్ హైస్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని కరస్పాండెంట్ కె.రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. లావణ్య 553, జ్ఞానేశ్వరి 542, లోహిత్ 513 మార్కులతోపాటు వందశాతం ఉత్తీర్ణత సాధించారని, వీరిని చైర్‌పర్సన్ ఎం.రమాదేవి, హెచ్‌ఎం శర్వాణి, టీచర్లు అభినందించారు.

● 'లిటిల్ ఫ్లవర్' స్కూల్‌లో..



విద్యానగర్ కాలనీలోని లిటిల్ ఫ్లవర్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని చైర్మన్ డాక్టర్ ఆర్.శేషాద్రి తెలిపారు. తేజస్వి 587, ఉషశ్రీ 584, అస్మిత, దీపిత, షేక్ అంజుమన్ 578 మార్కులతోపాటు వందశాతం ఉత్తీర్ణత నమోదుచేశారన్నారు. 38 మంది విద్యార్థులకుగాను 26 మందికి 520కి పైగా మార్కులు వచ్చాయన్నారు. కరస్పాండెంట్ ఆర్.రాధిక, ప్రిన్సిపల్ నాగరాణి, టీచర్లు అభినందించారు.

● 'సిల్వర్ ఓక్స్' స్కూల్‌లో..


విద్యార్థులతో అధినేత కేపీఎస్ వాసు

భవానీనగర్‌లోని సిల్వర్ ఓక్స్ ది స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని అధినేత కేపీఎస్ వాసు తెలిపారు. జతిన్ భరద్వాజ్ 598, శ్రీహరి 592, అఫిక్ 589 మార్కులతోపాటు వందశాతం ఉత్తీర్ణత నమోదుచేశారని చెప్పారు. 50 మంది విద్యార్థులకుగాను 49 మంది ప్రథమ శ్రేణిలో పాసయ్యారని చెప్పారు. వీరిని హెచ్‌ఎం జి.శిరీష, పీఆర్వో హరికృష్ణ, టీచర్లు అభినందించారు.

'ఎస్వీ చిల్డ్రన్స్' స్కూల్‌లో..: ఎస్వీ చిల్డ్రన్స్ విద్యార్థులు గాయత్రి, ఢిల్లీకుమార్ 593, కీర్తిశ్రీ, పూజిత 592, ముని పునీత్‌రెడ్డి, నితీష్, రూప్‌తేజ్, వర్ధిని, రిషిత 589 మార్కులు సాధించారని అధినేత కేపీఎస్ వాసు తెలిపారు. 327 మంది విద్యార్థులకుగాను 235 మందికి 500కిపైగా మార్కులు వచ్చాయన్నారు. వీరిని హెచ్‌ఎం స్వప్నలత, అసిస్టెంట్ హెచ్‌ఎం గాయత్రి, టీచర్లు అభినందించారు.

● 'రత్నం' స్కూల్‌లో..



శివజ్యోతినగర్‌లోని డాక్టర్ కిశోర్స్ రత్నం స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని ప్రిన్సిపల్ టి.పురుషోత్తమరెడ్డి తెలిపారు. ఆర్.చందన 592, ఇన్షాఖాన్ 588, పావన వెంకటకృష్ణ 587, పూజ, శ్రీవర్షిణి 586 మార్కులతోపాటు 15 మంది 580కిపైగా, 47 మంది 550కి పైగా మార్కులు సాధించినట్టు చెప్పారు. వీరిని మేనేజర్ వంశీకృష్ణ, గ్లోబల్ పాఠశాల ప్రిన్సిపాల్ రవి, ఉపాధ్యాయులు అభినందించారు.

● 'శ్రీచైతన్య' స్కూల్‌లో..



తిరుపతి జోన్‌లోని శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని ఏజీఎం సురేష్ తెలిపారు. సాయిలాస్య 598, వన్షిక, శ్రావణి 597, లక్ష్మీప్రియ, జాన్‌విక్టర్, లక్ష్మీతేజ, లక్ష్మీమానస, సాహిత్, జోషిణి, షేక్ రుహినాజ్, మానసకృష్ణ 595 మార్కులతో పాటు 40 మందికి 590కిపైగా, 147 మందికి 580కి పైగా, 175 మందికి 570కి పైగా, 192 మందికి 560కి పైగా మార్కులు వచ్చాయని తెలిపారు.

చంద్రగిరిలో గంజాయి, రౌడీయిజం రూపుమాపుతా

● ఆత్మీయ సదస్సులో పులివర్తి నాని
● వైసీపీ నుంచి టీడీపీలోకి వలసలు


చంద్రగిరిలో, చెన్నుగారిపల్లెలో నాని సమక్షంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరిన కార్యకర్తలు

చంద్రగిరి, ఏప్రిల్ 22: చంద్రగిరికి పూర్వవైభవం తీసుకువచ్చి, గంజాయి, రౌడీయిజాన్ని రూపుమాపుతానని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని అన్నారు. సోమవారం రాత్రి చంద్రగిరి కొత్తపేట, భవానీనగర్‌లో టీడీపీ నేత ఉగ్రాణం గురునాథరెడ్డి ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన నాని సమక్షంలో వైసీపీ నుంచి పలువురు టీడీపీలో చేరారు. ఈసందర్భంగా నాని మాట్లాడుతూ పదేళ్ల పాలనలో చంద్రగిరి అభివృద్ధిని భ్రష్టు పట్టించారని మండిపడ్డారు. గంజాయికి చంద్రగిరి అడ్డాగా మార్చి, విచ్చలవిడిగా దౌర్జన్యాలు చేస్తున్నారని ఆరోపించారు. భూగర్భ జలాలు అడుగంటి తాగునీటికి కూడా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మేజర్ పంచాయతీలో శ్మశాన వాటిక లేకపోవడం శోచనీయమన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే ప్రతి సమస్యకు పరిష్కారం చూపుతామని అన్నారు. టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రమణ్యం నాయుడు, నాయకులు ఏవీ రమణమూర్తి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ముడిపల్లి సురేష్‌రెడ్డి, నాయకులు గౌస్‌బాషా, టీడీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి సింగు సుధా, మండల ప్రధాన కార్యదర్శి కొండూరు ప్రవీణ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాకాల: మండలంలోని చెన్నుగారిపల్లె పంచాయతీ పరిధిలోని బార్లీకొండ బంగ్లా, చెన్నుగారిపల్లె దళితవాడలో సోమవారం వైసీపీకి చెందిన పలువురు తెలుగుదేశం పార్టీలో చేరారు. చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని సమక్షంలో బార్లీకొండ బంగ్లాకు చెందిన గౌతమ్ చౌదరి, వంశీ, రమేష్ నాయుడు, శేఖర్, చిట్టెమ్మ, రాజశేఖర్, బుజ్జి, నాగవేణి, శ్రీనివాసులు, వినయ్, హేమ, మాధవి, రవి, ఆషా, పద్మమ్మ, నరసింహులు, జమున, సిద్ధయ్య, మునెమ్మ, తేజ, నీలిమ, హేమ, చెన్నుగారిపల్లె దళితవాడకు చెందిన భాస్కర్, వెంకటేష్, ఓంకార్, లోకేష్, శివకుమార్, ప్రకాష్, ఎల్లప్ప, రమేష్‌బాబు, జానకిరామ్, మోహన్ కుమార్, సురేంద్ర, పూర్ణ, బాలాజీ, జయంతి, సారిక, దివ్య, లత, దుర్గ, విజయలక్ష్మి, కళావతి తదితరులు టీడీపీలో చేరారు. వీరికి పార్టీ కండువాలు కప్పి పులివర్తి నాని టీడీపీలోకి ఆహ్వానించారు. అనంతరం గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండల టీడీపీ, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తిరుచానూరు: తిరుపతి రూరల్ మండలం, తిరుమలనగర్ పంచాయతీకి చెందిన వార్డు మెంబర్లు రమేష్‌బాబు, మోహన్, వైసీపీ నేతలు సంతోష్ కుమార్, హరిబాబు, శంకర్, రఘు, నవీన్, పప్పీ, ఆంజనేయులు, చెంగల్ రాయులు, నవదీప్ తదితరులు చేరారు. రణధీరపురం పంచాయతీకి చెందిన సిద్ధు, నవీన్, సోమశేఖర్, ప్రవీణ్, పవన్, కృష్ణ, దుర్గాప్రసాద్, వంశీ, చెర్లోపల్లి పంచాయతీకి చెందిన వైస్ సర్పంచ్ చంద్రశేఖర్, మాజీ ఎంపీటీసీ రుద్రయ్య, సుబ్బరాయలు, ప్రసాద్, సాగర్ తదితరులు వైసీపీని వీడి టీడీపీలో చేరారు వారికి నాని కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.


నాని సమక్షంలో టీడీపీలో చేరుతున్న వైసీపీ నాయకులు, కార్యకర్తలు

నానీ గెలుపుకోసం ఇంటింటా ప్రచారం



రామచంద్రాపురం, ఏప్రిల్ 22: చంద్రగిరి ఎమ్మెల్యేగా పులివర్తి నానీని గెలిపించాలంటూ నియోజకవర్గ టీడీపీ రైతు సంఘం ఉపాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, మాజీ కార్యదర్శి నాదమునియాదవ్ చల్లావారిపల్లెలో సోమవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. చంద్రబాబు అమలు చేయనున్న సూపర్‌సిక్స్ పథకాల గురించి గ్రామస్తులకు వివరించారు. గిరి నాయుడు, జయచంద్ర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు పొన్నకాల్వ ఉత్సవం

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 22: గోవిందరాజస్వామి పొన్నకాల్వ ఉత్సవం మంగళవారం తిరుచానూరు సమీపంలో వేడుకగా జరుగనుంది. గోవిందరాజస్వామి ఆలయం నుంచి శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వామి, ఆండాల్ అమ్మవారు, శ్రీకృష్ణస్వామి, చక్రతాళ్వార్‌తో పాటు తొమ్మిదిమంది దేవేరులు ఉదయం 6గంటలకు ఊరేగింపుగా బయలుదేరి తనపల్లిరోడ్డులోని పొన్నకాల్వ మండపానికి చేరుకుంటారు. అక్కడ స్వామి అమ్మవార్లకు స్నపన తిరుమంజనం, ఊంజల్‌సేవ, సేవాకాలం, శాత్తుమొర, ఆస్థానం నిర్వహిస్తారు. సాయంత్రం 4.30గంటలకు గోవిందరాజస్వామివారు పద్మావతి అమ్మవారి ఆలయానికి చేరుకుంటారు. పూజల అనంతరం తిరిగి రాత్రి 8గంటలకు గోవిందరాజస్వామి ఆలయానికి చేరుకోవడంతో పొన్నకాల్వ ఉత్సవం ముగియనుంది.

కొత్త ఔషధం అభివృద్ధి సులభం

రామచంద్రాపురం, ఏప్రిల్ 22: కొత్త ఔషధం అభివృద్ధిలో స్టాటిస్టికల్ అనాలిసిస్ సిస్టం వంటి డిజిటల్ టెక్నాలజీలు కొత్త మార్పులు తీసుకువస్తున్నాయని, దీంతో ఔషధం అభివృద్ధిలో సమయాన్ని, వ్యయాన్ని తగ్గిస్తున్నాయని యూఎస్‌ఏకు చెందిన విక్టాన్సిగర్ అనలైటిక్స్ క్లినికల్ ఎస్‌ఏఎస్ ప్రోగ్రామర్ వెంకట్ ఇక్కుర్తి తెలిపారు. మండలంలోని వెంకట్రామాపురం సమీపంలోని సెవెన్ హిల్స్ ఫార్మసీ కళాశాలలో సోమవారం క్లినికల్ రీసెర్చ్, డ్రగ్ డిస్కవరీ అండర్ డెవలప్‌మెంట్‌లో అవకాశాలు, సవాళ్లను ఎదుర్కోవడం అనే అంశాలపై ఒకరోజు అంతర్జాతీయ వర్క్‌షాప్ నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎం.నిరంజన్‌బాబు, వర్క్‌షాప్ కన్వీనర్ ప్రొఫెసర్ శరవణ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ మల్లికార్జున, లావణ్య, డాక్టర్ ఎం.సంజీవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంపై ఎంబీయూలో అవగాహన


ప్రసంగిస్తున్న ఎంసీవీ ప్రసాద్

చంద్రగిరి, ఏప్రిల్ 22: చంద్రగిరి మండలం, ఎ.రంగంపేటలోని మోహన్‌బాబు విశ్వవిద్యాలయంలో సోమవారం సేంద్రియ వ్యవసాయం, ఆరోగ్యకరమైన వంటకాలు, ఉత్పత్తులపై అవగాహన సదస్సు జరిగింది. ఈసదస్సుకు ప్రకృతి వనంకు చెందిన ఎంసీవీ ప్రసాద్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ గాలి, నీరు, వాతావరణం, ఆహారం కలుషితమై ప్రజలు వివిధ రకాల జబ్బులకు గురవుతున్నారని తెలిపారు. ఈవిపత్తు నుంచి బయటపడేందుకు మన ప్రాంతంలో పండించే పంటలు, ప్రాచీన వంటకాలను ఆహారలో అధికంగా తీసుకోవాలని సూచించారు. ఎంబీయూ వీసీ నాగరాజ రామారావు, రిజిస్ట్రార్ డాక్టర్ సారథి, ప్రొఫెసర్లు శ్రీనివాసులు, ఈశ్వరయ్య, గిరిధరకృష్ణ, సాంబశివరావు, వ్యవసాయ, ఔషధ విభాగం, వైద్య అనుబంధ విభాగం విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

విజేతకు బహుమతి ప్రదానం


సర్టిఫికెట్, మెడల్‌తో వాణీప్రీతం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 22: ఎస్వీయూనివర్సిటీ-సాయి రాధాకృష్ణ ఎడ్యుకేషనల్ సొసైటీ సంయుక్తంగా చేపట్టిన సృజనాత్మక పోటీల్లో పాకనాటి వాణీప్రీతం అనే విద్యార్థి మొదటి బహుమతికి ఎంపికయ్యారు. అంతర్జాతీయ ఎర్త్ డే సందర్భంగా సోమవారం ఎస్వీయూనివర్సిటీలో పోటీలు నిర్వహించారు. తిరుపతిలోని కేంబ్రిడ్జ్ హైస్కూల్ ఏడో తరగతి విద్యార్థి వాణీప్రీతం మొదటిస్థానంలో నిలవడంతో పలువురు అభినందించారు.

వేడుకగా పెద్దకొట్టాయి ఉత్సవం

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 22: శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం పెద్ద కొట్టాయి ఉత్సవం ఘనంగా జరిగింది. స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను అలంకరించి ఆలయంలోని కోట మండపం వద్ద పగడ చెట్టు కింద సాయంత్రం కొలువు తీర్చారు. వట్టివేర్లతో చలువ వాతావరణం కల్పించారు. అభిషేకాలు, పూజలు చేశాక తిరిగి ఆలయంలోని అలంకార మండపంలో కొలువుదీర్చారు.

రెండు కళ్ల సిద్ధాంతం
వికటించిందా..?
వైసీపీని వీడుతున్న కీలక నేతలు

తిరుపతిరూరల్, ఏప్రిల్ 22: తిరుపతి రూరల్ మండలంలో వైసీపీ ప్రజాప్రతినిధి అవలంబించిన రెండు కళ్ల సిద్ధాంతం వికటిస్తోందా..? ఔననే అంటున్నాయి ఆ పార్టీ వర్గాలు. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నిన్నమొన్నటివరకు ఆ ప్రజాప్రతినిధి ప్రోత్సాహంతో మండలంలోని ద్వితీయ శ్రేణి నేతలు రెండువర్గాలుగా ఏర్పడి బలాబలాలను ప్రదర్శించేవారు. దీని వల్ల పంచాయతీపై ఎవరికీ ఆధిపత్యం లేకుండా ఆ నేత కనుసన్నలలోనే పాలన సాగుతుండేది. ఏ చిన్నపాటి సమస్య ఎదురైనా ఆయన తలుపు తట్టాల్సిన పరిస్థితి ఉండేది. దీన్ని ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే వరకు ఆయన సాధించిన విజయంగా చర్చించుకునేవారు. ప్రస్తుతం పరిస్థితి మారిపోయింది. ఇప్పటివరకు ఎన్ని జరిగినా మౌనంగా ఉండిన ద్వితీయ శ్రేణిలోని కీలక నేతలంతా ఒక్కొక్కరుగా పార్టీని వీడుతుండటం ఆ ప్రజాప్రతినిధిని ఆందోళనకు గురిచేస్తోందని ఆయనవెంట నడుస్తున్న కొందరు నేతలు బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారు.

రుయాలో దుర్గంధభరితంగా
రక్తపరీక్షల కేంద్రం


ల్యాబ్ ఎంట్రన్స్‌లో మూత్రం నమూనాలు, ల్యాబ్ పరిసరాల్లో మూత్రపు సీసాలు

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 22: రుయాస్పత్రిలోని రక్తపరీక్షల కేంద్రానికి వెళ్లాలంటే ఎవరైనా ముక్కు మూసుకోవాల్సిందే. వైద్య పరీక్షల కేంద్రంలో అనేక పరీక్షలు మూత్రం నుంచి తీస్తారు. ఇందుకు సిబ్బంది ఇచ్చే ప్రత్యేక డబ్బాల్లో రోగులు మూత్రం తీసుకొస్తారు. వాటిని పరీక్షల అనంతరం పరీక్ష కేంద్రం ముందే వదిలేస్తున్నారు. రోగులు తీసుకొచ్చిన ఈ మూత్రపు డబ్బాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చెత్తకుండీల్లో పడేయాలి. అలాగే నిర్లక్ష్యంగా వదిలేయడంతో వాటి వల్ల ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశాలున్నాయి. దీనికితోడు ప్రధాన ద్వారం ముందే వీటిని రోజంతా అలాగే వదిలేయడం వల్ల దుర్గంధం వెదజల్లుతోంది. ఇదిలా ఉంటే క్రియాటిన్, ప్రొటీన్ వంటి పరీక్షలు చేసేందుకు రోగుల నుంచి 24గంటలు పోసిన మూత్రాన్ని ప్రత్యేకంగా బాటిళ్లలో నింపి తీసుకురమ్మంటారు. వీటిలో పరీక్షలకు అవసరమైన కొంత మూత్రాన్ని తీసుకొని బాటిళ్లను రోగులకే ఇచ్చి బయట పడేయమంటారు. దీంతో వీటిని వారు కూడా ల్యాబ్ ఆవరణలోనే పడేస్తున్నారు. ఇకనైనా అధికారులు ల్యాబ్ పరిసరాలను శుభ్రంగా ఉంచాల్సిన అవసరం ఉంది.

● 'నారాయణ' స్కూల్‌లో..



నారాయణ విద్యాసంస్థల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని డీజీఎం కొండలరావు తెలిపారు. హర్షిత్ 598 మార్కులతోపాటు వందశాతం ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. 137 మంది విద్యార్థులకుగాను 130 మందికి 500కిపైగా మార్కులు రాగా, తెలుగులో 10 మంది, హిందీలో ఒకరు, ఇంగ్లీష్‌లో ఒకరు, గణితంలో 52 మంది, సైన్స్‌లో 15, సోషల్లో 14 మంది వందకు వంద మార్కులు సాధించారన్నారు. డీన్ శ్రీనివాసులు, ఏజీఎం కిషోర్, ప్రిన్సిపాల్ వంశీకృష్ణ, టీచర్లు పాల్గొన్నారు.

తిరుపతి

పాపవినాశనం వద్ద అడవిలో మంటలు



తిరుమల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో సందర్శనీయ ప్రదేశమైన పాపవినాశనం సమీపంలోని అడవిలో మంగళవారం మంటలు ఎగసిపడ్డాయి. వారం రోజులుగా శేషాచల అడవులు అగ్నికి ఆహుతవుతున్న విషయం తెలిసిందే. మామండూరు ప్రాంతంలోని అడవిలో మొదలైన మంటలు క్రమంగా తిరుమలకు సమీపం వరకు వచ్చాయి. శుక్రవారం ఏకంగా తిరుమలలోని పార్వేటమండపానికి సమీపంలోని శ్రీగంధవనం వరకు మంటలు వ్యాపించాయి.ఈ క్రమంలో టీటీడీ, ప్రభుత్వ ఫారెస్ట్ అధికారులు మంటలు వ్యాప్తిచెందకుండా చర్యలు తీసుకోవడంతో ప్రమాదం తప్పింది.శనివారం మంటలు ఆగిపోయాయను కున్నప్పటికీ ఆదివారం రాత్రి నుంచి మళ్లీ అడవిలో మంటలు కనిపించాయి. సోమవారం పాపవినాశనం సమీపానికి వచ్చిన మంటలు భారీగా ఎగసిపడ్డాయి.జనసంచారం దిశగా మంటలు రాకుండా అధికారులు ఫైర్‌లైన్స్ ఏర్పాటు చేశారు.

క్యాన్సర్‌పై అవగాహన పెంపొందించుకోండి



సమావేశంలో ప్రసంగిస్తున్న వీసీ శ్రీకాంత్‌రెడ్డి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 22: క్యాన్సర్ వ్యాధి పట్ల యువత అవగాహన పెంపొందించుకోవాలని ఎస్వీ యూనివర్సిటీ వీసీ శ్రీకాంత్ రెడ్డి సూచించారు. ఎస్వీ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ - ఎస్వీయూ పాపులేషన్ స్టడీస్ విభాగం సంయుక్తంగా శ్రీనివాసా ఆడిటోరియంలో సోమవారం క్యాన్సర్‌పై జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. స్విమ్స్ అంకాలజీ హెడ్ డాక్టర్ ప్రశాంత్ మాట్లాడుతూ.. పొగాకు, మద్యం, వారసత్వం వల్ల క్యాన్సర్ వస్తుందన్నారు. మెడికల్ అంకాలజీ డాక్టర్ లక్ష్మీ సంధ్య మాట్లాడుతూ.. దేశంలోని ప్రతి 12 మంది మహిళల్లో ఒకరికి గర్భాశయ ముఖద్వార, చెస్ట్ క్యాన్సర్ ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పద్మనాభం, పాపులేషన్ స్టడీస్ హెడ్ చంద్రశేఖరయ్య, ఉమెన్ స్టడీస్ హెడ్ సాయిసుజాత, ఈసీ మెంబర్ సుమకిరణ్, పలు విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

థాయ్‌లాండ్‌కు మహిళా వర్సిటీ వీసీ పయనం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 22: పద్మావతి మహిళా యూనివర్సిటీ వీసీ భారతి థాయ్‌లాండ్ పయనమయ్యారు. థాయ్‌లాండ్‌లోని ఏషియన్ పసిఫిక్ శిక్షణ కేంద్రంలో నిర్వహించే సదస్సులో 'పారిశ్రామిక రంగంలో డిజిటల్ టెక్నాలజీ అమలు - ప్రాధాన్యత' అనే అంశంపై వీసీ ప్రసంగించనున్నారు. ఇందుకోసం సోమవారం తిరుపతి నుంచి బయల్దేరి వెళ్లారు. కాగా, ఇండోనేషియాలోని ఉదయాన యూనివర్సిటీతో అవగాహనఒప్పందం చేసుకునేవిషయంపైనా వీసీ సంప్రదింపులు చేయనున్నారు. వీసీవెంట ఫారిన్ అఫైర్స్ డీన్ విజయలక్ష్మి ఉన్నారు.

ఎన్నికల విధుల్లోని జర్నలిస్టులకు పోస్టల్ బ్యాలెట్

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 22: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో విధుల్లో పాల్గొనే విలేకరులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. పోలింగ్ రోజున ఎన్నికల సరళిని పరిశీలించేందుకు మీడియా పాసులు పొందిన జర్నలిస్టులకు మాత్రమే ఈ అవకాశం ఉంటుందన్నారు. మంగళవారం సాయంత్రంలోపు కలెక్టరేట్‌లోని సమాచారశాఖ కార్యాలయంలో 12డి ఫారంతోపాటు ఓటర్ ఐడీ, అక్రిడిటేషన్, ఆధార్ జతచేసి పార్లమెంట్, అసెంబ్లీకి వేర్వేరుగా సమర్పించాలని సూచించారు.

రేపు విశ్వంలో ఏపీఆర్జేసీ నమూనా పరీక్ష

తిరుపతి(విద్య), ఏప్రిల్ 22: వరదరాజనగర్‌లోని విశ్వం టాలెంట్ స్కూల్లో బుధవారం ఉదయం 10 గంటలకు ఏపీఆర్జేసీ ఉచిత నమూనా పరీక్ష నిర్వహిస్తున్నట్టు ఛైర్మన్ డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో ఈనెల 25న జరిగే ప్రవేశ పరీక్షను దృష్టిలో ఉంచుకుని ఈ నమూనా పరీక్షను నిర్వహిస్తున్నామని విద్యార్థులు ఎటువంటి ప్రవేశ రుసుం చెల్లించకుండా హాల్‌టికెట్ జిరాక్స్ కాపీతో హాజరుకావొచ్చని చెప్పారు. వివరాలకు 86888 88802, 93999 76999 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఇద్దరు ఆటో డ్రైవర్లకు రెండ్రోజుల జైలుశిక్ష

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 22: మద్యం తాగి ఆటో నడిపి, ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగించిన ఇద్దరు ఆటో డ్రైవర్లకు రెండ్రోజుల జైలు శిక్ష, రూ.10,000 చొప్పున జరిమానా విధిస్తూ నాల్గవ అదనపు జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ సోమవారం తీర్పు చెప్పారు. వరదరాజనగర్‌కు చెందిన చిన్ని ప్రసాద్, నెల్లూరుకు చెందిన సుధాకర్ ఇటీవల మద్యం తాగి ఆటోలు నడుపుతుండగా పోలీసులకు పట్టుబడ్డారు. వీరిని న్యాయమూర్తి ముందు హాజరుపరచగా పైవిధంగా శిక్ష విధించారని ట్రాఫిక్ డీఎస్పీ రమణకుమార్ చెప్పారు. అలాగే ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన మరో 11 మంది వాహనదారులకు ఒక్కొక్కరికి రూ.10,000 చొప్పున రూ.1,10,000 జరిమానా విధించారని పేర్కొన్నారు.

రంజాన్ తోఫా ఏది?

- ముస్లింలను మోసం చేసిన జగన్
- జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు


ఐక్యతా నినాదాలు చేస్తున్న నాయకులు, టీడీపీలో చేరిన ముస్లింలు

తిరుపతి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): రంజాన్ తోఫా ఇచ్చే చంద్రబాబును కాదనుకుని.. మాయమాటలతో మభ్యపెట్టిన జగన్మోహన్ రెడ్డికి ఓటువేసి పండుగ పూట కూడా ముస్లిం సోదరులు ఇబ్బంది పడ్డారని టీడీపీ, బీజేపీ బలపరుస్తున్న జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు మండిపడ్డారు. స్థానిక 26వ డివిజన్ నవాబుపేటకు చెందిన దాదాపు 150 మంది ముస్లింలు వైసీపీని వీడి పులుగోరు మురళీ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. పులుగోరు నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు నరసింహ యాదవ్, ఆరణిలు టీడీపీ కండువాలు కప్పి ఆహ్వానించారు. వీరిలో మహబూబ్ బాషా, బబ్లూ, చాంద్, ఖాదర్, మనోస్, చిన్నబ్బులతోపాటు పెద్దఎత్తున ముస్లింలున్నారు. ఈ సందర్భంగా ఆరణి మాట్లాడుతూ.. అన్ని వర్గాలు తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీలను ఆదరిస్తున్నాయని చెప్పారు. ముస్లింలను జగన్.. నమ్మించి మోసం చేశారని విమర్శించారు. ముస్లింలు ఎన్డీఏ కూటమి వైపే ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆర్సీ మునికృష్ణ, జేబీ శ్రీనివాస్, మహబూబ్ బాషా, గెంజి సుధాకర్ రెడ్డి, మునిరామయ్య, రఘు పాల్గొన్నారు

నేడు ఆరణి నామినేషన్

ఆరణి శ్రీనివాసులు మంగళవారం మధ్యాహ్నం ఒంటిగంట నుంచి రెండు గంటల మధ్య నామినేషన్ దాఖలు చేయనున్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీ ముఖ్యనేతలతోపాటు పెద్ద ఎత్తున కార్యకర్తలతో ర్యాలీగా వెళ్లి నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఉదయం 9.30 గంటలకు ఎస్వీయూ తారకరామ స్టేడియం నుంచి ర్యాలీ ప్రారంభమై బాలాజీ కాలనీ సర్కిల్‌లోని మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించనున్నారు. అనంతరం వెస్ట్ చర్చిమీదుగా ఎంఆర్‌పల్లె సర్కిల్, అన్నమయ్య సర్కిల్ వరకు ర్యాలీ సాగనుంది.

ఎన్డీఏ కూటమిదే విజయం

- బీజేపీ తిరుపతి ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు


కలెక్టర్ ప్రవీణ్‌కుమార్‌కు నామినేషన్ పత్రాలను సమర్పిస్తున్న బీజేపీ తిరుపతి ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద్‌రావు - ర్యాలీలో పాల్గొన్న వెలగపల్లి వరప్రసాద రావు, కూటమి పార్టీ నేతలు, కార్యకర్తలు

తిరుపతి, (ఉపాధ్యాయనగర్) ఏప్రిల్ 22 : వచ్చే ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి విజయం సాధిస్తుందని ఈ మేరకు ప్రజల స్పందన అలాగే ఉందని తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు అన్నారు. సోమవారం తిరుపతి ఎంపీ అభ్యర్థిగా వరప్రసాదరావు నామినేషన్ దాఖలు చేశారు. కేంద్రమంత్రి మురుగన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు నరసింహయాదవ్, జనసేన నాయకుడు హరిప్రసాద్, బీజేపీ నాయకుడు నవీన్‌గుప్తాతో కలసి ఆయన నామినేషన్ పత్రాలను జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్‌కు అందజేశారు. అంతకుముందు బాలాజీ కాలనీ నుంచి ర్యాలీ ప్రారంభించారు. అక్కడ మహాత్మా జ్యోతిరావుపూలే విగ్రహానికి నివాళి అర్పించారు. అక్కడి నుంచి భారీ ర్యాలీ గోవింద రాజుస్వామి ఆలయం సర్కిల్ మీదుగా ఆర్టీసీ బస్టాండ్ వరకు సాగింది. అక్కడ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ ర్యాలీతో బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనడంతో కార్యకర్తల్లో జోష్ కన్పించింది. నామినేషన్ అనంతరం ఆయన మాట్లాడుతూ... తిరుపతి ఎంపీ స్థానంలో తాను విజయం సాధించబోతున్నట్లుగా ప్రకటించారు. జగన్ అవినీతి, దౌర్జన్యాలే తనకు విజయాన్ని అందిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. తనపై నమ్మకంతో టిక్కెట్ కేటాయించిన బీజేపీ అధిష్ఠానానికి సహకరిస్తున్న టీడీపీ, జనసేన నాయకులకు కృతజ్ఞతలు తెలుపు కుంటున్నానన్నారు. ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండి అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు, శ్రీకాళహస్తి, నగరి టీడీపీ అభ్యర్థులు బొజ్జల సుధీర్‌రెడ్డి, గాలి భానుప్రకాశ్‌రెడ్డి, టీడీపీ నాయకులు పనబాక కృష్ణయ్య, బీజేపీ నాయకులు కోలా ఆనంద్, చంద్రప్ప, జనసేన నాయకులు వనిత తదితరులు పాల్గొన్నారు. అనంతరం తిరుపతిలో ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు.

'బీవీకే అసోసియేషన్ ఏర్పాటు చేస్తాం'

తిరుపతి(కపిలతీర్థం), ఏప్రిల్ 22: బ్రాహ్మణ, వైశ్య, క్షత్రియ(బీవీకే) అసోసియేషన్ ఏర్పాటు చేస్తున్నట్లు భీమాస్ అశోక్, మహేశ్వర గుప్తా, రుద్రరాజు శ్రీదేవి అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో వీరు సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. బీవీకే కులస్తులకు జరుగుతున్న అన్యాయాలను అరికట్టి, అన్నివిధాలా లబ్ధి చేకూర్చడమే ధ్యేయంగా త్వరలో సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. వివరాలకు 9849282762, 9550583123 నెంబర్లను సంప్రదించాలన్నారు. ఈ సమావేశంలో జక్కా సుబ్బరాజు, సీఆర్‌కే శేషగిరిరావు, బాలరామరాజు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.38 కోట్లు

తిరుమల, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వర స్వామి హుండీ ఆదాయం రూ.3.38 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు ఆదాయం లభించినట్లు టీటీడీ సోమవారం ఉదయం ప్రకటించింది. ఇక, ఆదివారం 77,366 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 24,375 మంది తలనీలాలు సమర్పించారని టీటీడీ ఒక ప్రకటనలో పేర్కొంది.

గంగమ్మగుడిలో నేడు చండీహోమం

తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 22: తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ గుడిలో మంగళవారం ఉదయం 8.30 గంటలకు చండీహోమం జరుగుతుంది. అమ్మవారి వార్షిక జాతర మంగళవారం కూడా కావడంతో అమ్మవారికి ప్రత్యేక అభిషేకం, బంగారు ముఖ బింబం, బంగారు వజ్రకిరీటంతో పాటు మొక్కజొన్నలతో గర్భాలయాన్ని అలంకరిస్తారు. ఉదయం 9.30 నుంచి రాత్రి 9 గంటల వరకు భక్తులకు దర్శనం ఉంటుందని ఆలయ కార్యనిర్వాహణాధికారి కె. మమత తెలిపారు.

3.5 కిలోల వెండి వస్తువుల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న వెండి వస్తువులను చూపుతున్న పోలీసులు

తిరుపతి (నేరవిభాగం), ఏప్రిల్ 22: చెన్నై నుంచి తిరుపతికి తీసుకొస్తున్న రూ.3.11 లక్షల విలువ చేసే 3.5 కిలోల వెండి వస్తువులను వెస్ట్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ జయనాయక్ తెలిపిన వివరాల మేరకు.. చెన్నైకి చెందిన మహావీర్ దీపక్ కొంత కాలంగా వెండి, బంగారాన్ని అడ్డదారుల్లో తీసుకొచ్చి తిరుపతిలోని కొన్ని బంగారు దుకాణాలకు విక్రయించేవాడు. ఈ నేపథ్యంలో చెన్నై నుంచి దాదాపు రూ.3.11 లక్షలు విలువ చేసే 3.5 కిలోల వెండి వస్తువులు ఎలాంటి బిల్లులు, అనుమతి పత్రాలు లేకుండా తీసుకొస్తుండగా, ప్రకాశం రోడ్డులో వెస్ట్ సీఐ, సిబ్బంది కాపు కాచి పట్టుకున్నారు. వెండి వస్తువులకు సంబంధించి బిల్లులు లేకపోవడంతో సీజ్ చేసి, ఆదాయ పన్ను శాఖకు అప్పగించినట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 22: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. రూరల్ స్టేషన్ ఎస్ఐ నాగేంద్రబాబు తెలిపిన వివరాల మేరకు.. అంబేడ్కర్ కాలనీకి చెందిన దిలీప్‌బాబు స్కూటర్‌పై తనపల్లెకి సోమవారం సొంత పనిమీద బయల్దేరాడు. ముందు వెళుతున్న లారీ డ్రైవర్ అకస్మాత్తుగా బ్రేక్ వేశాడు. వెనుక వస్తున్న దిలీప్ తల లారీకి తగిలి పక్కనే ఉన్న డివైడర్‌ను ఢీకొనడంతో బలమైన గాయమైంది. ఆస్పత్రికి తరలించేలోగా మృతి చెందాడు. డ్రైవర్ లారీని వదలి పరారయ్యాడు. ఎస్ఐ నాగేంద్రబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయాకు తరలించారు. లారీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ఆంధ్రజ్యోతి జన కేతనం



హమారా ఘర్‌మే .. నై .. మేలు .. జా... జా...!

ఈడ ఆయన పెత్తనం ఏందబ్బా..!



'ఈరోజు నామినేషన్ వేసేదానికి ఆయప్పతో కూడా పెద్దాయన వస్తున్నాడంటా కదబ్బా' అంటూ టీ తాగేందుకు వచ్చిన సుబ్బయ్యను అడిగాడు టీ కొట్టు వెంకటేశులు. 'ఔనబ్బా నాక్కూడా నిన్న మద్యాహ్నాందా తెలిసింది' అన్నాడు దీర్ఘంగా రాగం తీస్తూ సుబ్బయ్య. 'ఏందబ్బా ఇది... ఎక్కడో ఉండే ఆయనకి ఇక్కడ పెత్తనం ఎందుకబ్బా. ఈ అయిదేండ్లు ఇక్కడ మొత్తం గాలి చేసేశాడు. నడిచేదానికి రోడ్డు కూడా లేకుండా చేశాడు మహానుభావుడు. మళ్ళీ ఇప్పుడు యాడనుంచో ఒకాయను తీసుకొచ్చి నిలబెడుతున్నాడు' విసుక్కుంటూ అన్నాడు వెంకటేశులు. పేపర్ చదువుతూ లీనమైపోయి ఉన్న రామయ్య తలపైకెత్తి ఇద్దరు వైపు చూస్తూ, 'నామినేషన్‌కు కూడా ఈయన రావాల్సిందేనా. ఏందోబో. మనూరు ఏమైపోతోందో. చివరకు మనమందరం మెడ్రాసుకు ఎళ్ళిపోవాల్సిందేనా' అని విచారంగా అన్నాడు. సుబ్బయ్య కలగజేసుకుని 'ముందు మన నాయకులను అనాలి. ఆ పెద్దాయన చెప్పినట్టే పాడుతున్నారు.' ఇంతలో పేపర్ చదువుతున్న రామయ్య పేపర్ మడిచి టేబుల్‌పై పెడుతూ 'సరేలే..బ్బా. జనాలు మాత్రం ఈ సారి సరిగ్గా చేస్తారు చూడు. ఈ దెబ్బతో మళ్ళీ ఆయన ఈడ కనబడడు' అని కసిగా అంటూ అక్కడ నుంచి వెళ్లిపోయాడు. ఈ సంభాషణ అంతా సత్యవేడు పట్టణంలో ఒక టీ బంకు దగ్గర జరిగింది. వైసీపీ అభ్యర్థి గురించీ, ఇక్కడి రాజకీయాలను శాసిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి గురించీ స్థానిక ప్రజల్లో ఎంత చర్చ జరుగుతూ ఉందో ఈ సంభాషణ అద్దం పడుతోంది.

-సత్యవేడు

ఇదీ ముందు



నాయుడుపేట మూడో వార్డులో ప్రచారానికి ఇంటింటి గడప తొక్కుతున్న వైసీపీ నాయకులు అక్కడి ప్రజల మాటలతో అవాక్కయ్యారు. ఏ ఇంటికి జగన్ ఎంత మేలు చేశాడో లెక్కగట్టి ముద్రించిన కరపత్రాలు పంచుతూ ఓట్లడుగుతుండగా ఒక ఇంటి వాళ్లు కరపత్రం చూపిస్తూ 'హమారా ఘర్‌మే .. నై .. మేలు .. జా... జ. జా' అంటూ మొహంమీదే అనేశారు. జగన్ పథకాల లబ్ధి ఏదీ ఆ ఇంటికి దక్కకపోవడమే ఇందుకు కారణం. ప్రచారానికి వచ్చిన నాయకులు వారికి నచ్చజెప్పే మాటలేవో మొదలు పెట్టగానే ఆ ఇంటివారు విసుక్కున్నారు. 'సీఎం జగన్ సిద్ధం సభలో ఏం చెప్పినాడు' అని ప్రశ్నించారు. 'మీ బిడ్డ.. ఈ జగన్ మిమ్మల్ని కోరేది ఒకటే.. మీ కుటుంబంలో ఎవర్కైనా మేలు జరిగే ఉంటే.. నాకు ఓటు వేయండి.. మంచి జరగకుంటే ఓటు వేయద్దు.' అన్నాడా లేదా అని నిలదీశారు. 'ఆ యబ్బాయి చెప్పిందే కదా.. మా ఇంటికి మేలేమీ జరగలేదు కాబట్టి మా ఓట్లు అడగద్దు' అని తెగేసి చెప్పేశారు. ఇదే తీరులో రెండు మూడు ఇళ్లలో ఎదురవడంతో వైసీపీ ప్రచార బృందం బిక్కమొహాలు వేసుకుని వెనుతిరిగారు.

- నాయుడు పేట/ టౌన్



ఆటా.. పాటా



ప్రచారాల్లో ట్రెండ్ మారింది. టెక్నాలజీకి ప్రాధాన్యం పెరిగింది. ఒకవైపు సోషల్ మీడియాను వేదికగా మార్చుకోగా మరోవైపు ప్రత్యక్ష ప్రచారాల్లోనూ వీడియో డిస్‌ప్లే స్క్రీన్‌లు వినియోగిస్తున్నారు. వీటిల్లో గ్రాఫిక్స్, తమ కోసం రూపొందించుకున్న పాటలు, షర్ట్ ఫిల్ములు వంటివి ప్రదర్శిస్తున్నారు. ఈ వాహనాలు పల్లెలను చుట్టేస్తున్నాయి. అచ్చం సినిమా టజర్‌ల లాగే అభ్యర్థులతో టీజర్‌లు రూపొందించి విడుదల చేస్తున్నారు. ఇవన్నీ ఒక ఎత్తయితే అభ్యర్థులను కీర్తిస్తూ పాటలు కట్టి పాడి వీడియో దృశ్యాలుగా షూట్ చేసి ప్రదర్శించడం మరొక ఎత్తు. పార్టీల ప్రచార పాటలతో పాటూ ఒక్కో అభ్యర్థి పేరుతో కనీసం పది పాటలు కొత్తగా రూపొందిస్తున్నారు. వెంకటగిరి నియోజకవర్గంలో ఈ పాటలు హోరెత్తుతున్నాయి. సినిమా స్టయిల్‌లో స్వరాలు కూర్చి అదే పద్ధతిలో డాన్సులు చేయించి వీటిని రికార్డు చేస్తున్నారు. యూట్యూబ్‌లోనూ ఇవి హల్‌చల్ చేస్తున్నాయి. ఈ పాటలు రాయించి, రికార్డు చేయడం కోసం చెన్నై, హైదరాబాద్‌లకు పరుగులు తీస్తున్నారు.

- డక్కిలి

ఓటర్ల నాడి కోసం..

అభ్యర్థుల తరుపున కుటుంబసభ్యులు ప్రచారం చేయడం సాధారణం. గూడూరు బరిలో నిలిచిన ప్రధాన పార్టీ అభ్యర్థులిద్దరి పక్షాన వారి తనయులు ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. ఇక్కడ విశేషమేమిటంటే అభ్యర్థుల తనయులిద్దరూ వైద్యులు. టీడీపీ తరఫున పోటీ చేస్తున్న పాశిం సునీల్‌కుమార్ కుమారుడు జశ్వంత్‌కుమార్ ఎంబీబీఎస్ పూర్తిచేసి పీజీ జనరల్ మెడిసిన్ చేస్తున్నారు. అధికార వైసీపీ అభ్యర్థి ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ తనయుడు రేవంత్‌చక్రవర్తి కూడా పీజీ ఆర్థోపెడిక్ చేస్తున్నారు. ఎన్నికల నగారా మోగినప్పటి నుంచి ఈ యువ డాక్టర్లిద్దరు గూడూరులో తండ్రుల గెలుపు కోసం విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.

- గూడూరు అర్బన్



ప్రచారం నిర్వహిస్తున్న మేరిగ రేవంత్‌చక్రవర్తి



ప్రచారంలో పాశం జశ్వంత్‌కుమార్



తిరుపతి ఆంధ్రజ్యోతి

రద్దయిన డీకేటీ పట్టాలను నేను అధికారంలోకి రాగానే రైతులకు ఇప్పించేస్తా.

2018 జనవరి 10న చంద్రగిరి నియోజకవర్గం రామచంద్రాపురం మండలం అనుప్పల్లిలో పాదయాత్ర సందర్భంలో జగన్ అన్న మాట ఇది.

జగన్‌రెడ్డి హామీ ఇచ్చి 68 నెలలు గడచింది. మరి ఏం జరిగింది?



పట్టాలెక్కడ జగనా?

అనుప్పల్లి రైతుల గోడు

విపక్ష నేత వైఎస్ జగన్ 2018లో పాదయాత్ర సమయంలో అనుప్పల్లి పంచాయతీ నెమళ్ళగుంటపల్లిలో రైతు సదస్సు నిర్వహించారు. డీకేటీ పట్టాల రద్దు సమస్యను వైసీపీ రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు నాగిరెడ్డి, స్థానిక ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి జగన్‌కు నివేదించారు. తాను అధికారంలోకి రాగానే బాధిత రైతులకు భూములను తిరిగి ఇప్పిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఐదేళ్ళు గడిచిపోయినా పట్టాలు పునరుద్ధరించలేదు. బాధిత రైతులు ఇపుడు సీఎం జగన్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే చెవిరెడ్డిపైనా మండిపడుతున్నారు.

అనుప్పల్లి సమస్య ఇదీ..

1996-2004 మధ్య అనుప్పల్లి పంచాయతీలో టీడీపీ ప్రభుత్వం, 2008లో కాంగ్రెస్ ప్రభుత్వం 200 మంది పేద రైతులకు సుమారు 300 ఎకరాలు కేటాయించాయి. పట్టాలు కూడా జారీ చేశాయి. కొందరు ఆ పట్టాల ఆధారంగా బ్యాంకుల్లో రుణాలు తీసుకున్నారు. మరికొందరు బోర్లు తవ్వుకుని మామిడి మొక్కలు నాటుకున్నారు. ఏడేళ్ళ కిందట రెవిన్యూ అధికారులు పట్టాల జారీ సక్రమంగా జరగలేదని రద్దుకు ప్రతిపాదించారు. సర్వే నంబరు 410 నుంచీ 493 వరకూ ఉన్న భూముల పట్టాలను రికార్డుల్లో నమోదు చేయడంలో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం వహించడం రైతులకు శాపంగా మారింది. 2017లో అప్పటి ఉమ్మడి చిత్తూరు జిల్లా కలెక్టర్ ప్రద్యుమ్న ఈ డీకేటీ పట్టాలను రద్దు చేశారు. బాధిత రైతులు అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేసినా న్యాయం జరగలేదు. విసిగి వేసారిన రైతులు భూములపై ఆశలు వదిలేసుకున్నారు.

జగన్‌ను నమ్మి చెడ్డా

ప్రభుత్వం మాకు 2.95 ఎకరాల డీకేటీ పట్టా ఇచ్చింది. దీని మీద బ్యాంకులో రుణం తీసుకున్నాం. అధికారులు తర్వాత పట్టా రద్దుచేశారు. దీంతో ఆన్‌లైన్‌లో నా పేరు కనపడక రుణమాఫీ వర్తించకుండా పోయింది. బ్యాంకులో రూ.లక్ష రుణం తీసుకుంటే వడ్డీ పెరిగి రూ.2 లక్షలు అయింది. పాదయాత్రలో జగన్ మా ఊరొస్తే గోడు వెళ్ళబోసుకున్నాం. అధికారంలోకి వస్తానే పట్టాలు ఇస్తామని తర్వాత పట్టించుకోలేదు. ఆయన్ను నమ్మి మోసపోయా.

- ఎన్.లక్ష్మమ్మ, అనుప్పల్లి



సీఎం అయ్యాక పట్టించుకోలేదు



మా స్వాధీనంలో ఉన్న 75 సెంట్ల భూమికి 2008లో ప్రభుత్వం పట్టా ఇచ్చింది. అందులో మామిడి తోట పెట్టుకున్నా. కొన్నేళ్ళకు అధికారులు పట్టాను రద్దు చేశారు. ప్రతి గ్రామసభలో ఫిర్యాదు చేస్తూనే వున్నాం. న్యాయం జరగలేదు. పాదయాత్రలో జగన్‌కు కూడా చెప్పుకున్నాం. మాటిచ్చి ప్రభుత్వం వచ్చాక పట్టించుకోలేదు.

- చిన్నస్వామి, గోకులాపురం

ఎమ్మెల్యే కూడా న్యాయం చేయలేదు

పట్టాల రద్దు విషయం ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి చాలా సార్లు చెప్పాం. ఆయన కూడా న్యాయం చేయలేదు. జగన్ మా ఊరికొచ్చినపుడు ఆయనకూ చెప్పాము. పట్టాలు రద్దు చేసినందున రుణమాఫీ కాలేదు. తీసుకున్న రుణానికి బ్యాంకు అధికారులు నోటీసుల మీద నోటీసులు పంపిస్తా వుంటే బిడ్డ పెళ్లికి పెట్టుకున్న డబ్బు కట్టేసినాము.

- కె.ధనలక్ష్మి, గోకులాపురం



మోసపోయా



2008లో మాకు 1.50 ఎకరా ఇచ్చారు. డీకేటీ పట్టా ఇచ్చినందున మామిడి మొక్కలు నాటుకున్నాము. తోట ఎదిగినాక 2017లో రెవెన్యూ అధికారులు పట్టా రద్దు చేశారు. ఆన్‌లైన్‌లో పేరు తీసేశారు.. అధికారంలోకి రాగానే డీకేటీ పట్టా తిరిగి ఇప్పిస్తామని జగన్ హామీ ఇచ్చారు. పదవీ కాలం కూడా పూర్తయిపోతున్నా మాకు మాత్రం న్యాయం చేయలేదు.

- బి.మోహనరాణి, అనుప్పల్లి

సిరా చుక్క కత

డక్కిలి, ఏప్రిల్ 22 : ఎన్నికల్లో ఓటు వేశాక పోలింగ్ కేంద్రంలో ఓటరు చూపుడు వేలిపై సిరా చుక్క గుర్తుగా పెడుతుంటారు. దీంతో సదరు ఓటరు మరో ఓటు వేయడానికి వీలుండదు. దొంగ ఓట్ల కట్టడికి ఎన్నికల కమిషన్ ఎప్పుడో రూపొందించిన నిబంధన ఇది. ఈ సిరా గుర్తు 72 గంటల పాటు చెరిగిపోదు. ఎవరెన్ని ప్రయత్నాలు చేసినా సాధ్యం కాదు. మైసూరుకు చెందిన మైసూరు పెయింట్స్ అండ్ వార్నిష్ అనే పరిశ్రమ ఈ ఇంకును తయారు చేస్తోంది. 1962 నుంచి దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా ఈ సిరానే ఎన్నికల కమిషన్ ఉపయోగిస్తోంది. ఈ సిరాలో 7.25 శాతం సిల్వర్, నైట్రేట్ కలపడం వల్ల అంత తొందగా చెరిగిపోదని నిపుణులు చెబుతారు.



తిరుపతి వర్తమానం



కూటమి కలయికతో స్పీడు తగ్గిన ఫ్యాను

సిటింగ్ ఎమ్మెల్యేకు బదులు ఆయన తనయుడు పోటీచేయడం, టీడీపీ కాకుండా దాని మిత్ర పక్షమైన జనసేన నుంచి చిత్తూరు సిటింగ్ ఎమ్మెల్యే బరిలో నిలబడటంతో తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నిక ఈసారి ఆసక్తిదాయకంగా మారింది. గత ఎన్నికల్లో స్వల్ప ఆధిక్యతతో గట్టెక్కిన వైసీపీ ఎమ్మెల్యే, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ఈదఫా తాను పోటీ చేయకుండా వారసునిగా కుమారుడు, కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ అభినయరెడ్డికి పార్టీ టికెట్ సంపాదించుకున్నారు. వైసీపీకి రాజీనామా చేసి జనసేనలో చేరిన చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తిరుపతి బరిలో నిలిచారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

● ఏకతాటిపైకి ఎన్డీఏ కూటమి నాయకులు ● వైసీపీ నుంచి పెద్ద ఎత్తున చేరికలు
● ఆ పార్టీలో అవినీతి ఆరోపణల గుబులు

● పవన్ పర్యటనతో వైసీపీలో గుబులు

కొద్దిరోజుల క్రితం ఆరణి అభ్యర్థిత్వంపై తిరుపతి ఎన్డీఏ కూటమి (టీడీపీ-జనసేన-బీజేపీ)లోని అసమ్మతి పోరు తనకు ఉపకరిస్తుందని వైసీపీ ఆశలు పెట్టుకుంది. కానీ టీడీపీ, జనసేన అధినేతలు స్వయంగా జోక్యం చేసుకుని పార్టీ నాయకులలోని అసంతృప్తిని చల్లార్చారు. పవన్ కల్యాణ్ పర్యటనతో అసమ్మతి పటాపంచలైంది. దీంతో వైసీపీలో గుబులు పట్టుకుంది. ఐదేళ్లుగా జరిగిన స్థానిక, ఉప, టౌన్ బ్యాంకు ఎన్నికలన్నింటిలోనూ ఫేక్ ఓట్లపైనే ఆధారపడ్డ అధికార పార్టీ, సార్వత్రిక ఎన్నికల్లోనూ అదేపంథాలో నడవాలన్న పన్నాగం సిద్ధం చేసుకున్నా ఈసారి బెడిసికొట్టింది. తన తండ్రికి ఆఖరి ఏడాది దక్కిన టీటీడీ ఛైర్మన్ పదవితో అడ్డగోలుగా శ్రీవారి నిధులు దుర్వినియోగమయ్యామనే విమర్శలు అభినయ్ విజయాన్ని ప్రభావితం చేస్తాయని పార్టీ వర్గాలు ఆందోళన చెందుతున్నాయి. వైసీపీ ద్వితీయ శ్రేణి నాయకులు కొందరు అయిష్టంగానే ప్రచారంలో పాల్గొంటున్నట్టుగా కనిపిస్తోంది. ఫలితంగా అధికార వైసీపీలో మునుపటి ఉత్సాహం కనిపించడంలేదు.

అలుపెరగని ప్రచారం : జనసేన అసెంబ్లీ అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు ఏడు పదుల వయస్సులోనూ ఎండను సైతం లెక్కచేయకుండా ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఉదయం వాకర్స్‌తో కలిసి నడుస్తూ ప్రచారం చేస్తూ ఆతర్వాత కూటమి నాయకులతో ఇంటింటా తిరుగుతున్నారు. గాజు గ్లాసు గుర్తును ప్రజల చెంతకు తీసుకుపోతున్నారు. సొంత నిధులతో మసీదులు, ఈద్గా మైదానాల ఆధునీకరణ చేస్తామని రంజాన్ పర్వదినం సందర్భంగా ఆయన ప్రకటించి ముస్లిం సోదరుల అభిమానాన్ని కూడగట్టుకున్నారు. కూటమి నాయకులందరూ ఏకతాటి మీదకు రావడంతో తిరుపతిలో రాజకీయ వాతావరణం పూర్తిగా మారిపోయింది. టీడీపీ మాజీ ఎమ్మెల్యే, నియోజవకర్గ ఇంఛార్జి సుగుణమ్మ, జనసేన పార్టీ నేత కిరణ్ రాయల్‌తో పాటు టీడీపీ నేతలు ఊకా విజయకుమార్, బేబీ శ్రీనివాస్ తదితరులు మూకుమ్మడిగా ప్రచారంలో కదలడంతో కూటమి శ్రేణుల్లో సంబరం నెలకొంది. టీడీపీ సీనియర్ నేత ముబ్బు దేవనారాయణ రెడ్డి (పెద్దబ్బ) వైసీపీ అభ్యర్థి భూమన అభినయ్ రెడ్డిని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

చేరికలతో కూటమిలో ఉత్సాహం

ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తర్వాత వైసీపీ నేతలు అన్నా రామచంద్రయ్య, అన్నా రామకృష్ణయ్య సోదరులు ఆ పార్టీకి రాజీనామా చేశారు. కార్పొరేటర్లుగా ఉన్న వారి ఇద్దరు కుమార్తెలు కూడా ఆ పార్టీనుంచి బయటకు వచ్చేశారు. జనసేన, టీడీపీలో నిత్యం చేరికలు కనిపిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పొలకల మల్లిఖార్జున్ ఇటీవల పవన్ సమక్షంలో జనసేనలో చేరి నగరంలో భారీ ర్యాలీకూడా నిర్వహించారు. మరో యువనాయకుడు పాటకం వెంకటేష్ కూడా జనసేనలోకి చేరబోతున్నట్టు తెలుస్తోంది.

వామపక్షాల బలమేంతో...

ఇండియా కూటమిలో తిరుపతి అసెంబ్లీ సీటు సీపీఐకి దక్కింది. ఇక్కడ వామపక్షాల నేతలు వైసీపీ ఎమ్మెల్యేతో చెట్టాపట్టాలు వేసుకుని తిరుగుతుంటారన్న విమర్శలు ఉన్నాయి. ఎమ్మెల్యే అభ్యర్థి సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళీతో పాటు వామపక్ష నేతలు వైసీపీ నేతలపై భూకబ్జాలు, దౌర్జన్యాలు, అవినీతి వంటి అనేక ఆరోపణలపై పల్లెత్తి మాట అన్న దాఖలాలు లేవు. మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణం వెనుక భారీ అవినీతి జరిగిందని లోకమంతా కోడై కూసినా టీడీఆర్ బాండ్ల వ్యవహారంపై వీరు ప్రశ్నించిందిగానీ, ఖండించిందీ లేదు. టీటీడీ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు న్యాయం చేశారంటూ కరుణాకరరెడ్డిని సన్మానాల్లో ముంచెత్తిన నాయకులు ఆయన కుమారుడిపై ఎలా పోరాడుతారో అని జనం అనుకుంటున్నారు.



కండువా గోలేంట్రా బాబు



నూర్‌బాషాకు కండువా కప్పుతున్న వైసీపీ నేతలు

గ్రామాల్లో కాస్త పలుకుబడి ఉన్న టీడీపీ నేతలు కనిపిస్తే చాలు.. వైసీపీ కండువా వేసేస్తున్నారు. ఇలా రామకుప్పానికి చెందిన నూర్‌బాషాకు రెండు సార్లు కండువా కప్పారు. అలాగే, ఇందిరానగర్‌కు చెందిన ఓ వ్యక్తి మసీదులో ప్రార్థన ముగించుకుని ఇంటికి వస్తుండగా వైసీపీ నేతలు అటుగా ప్రచారం చేస్తూ వచ్చారు. వెంటనే నేతలు ఆ 65 ఏళ్ల వ్యక్తికి తమ పార్టీ కండువా కప్పేశారు. ఆ ఫొటోలను వాట్సప్ గ్రూపుల్లో వైరల్ చేశారు. ఇలాంటి అనుభవం చాలామందికి ఎదురవుతోంది. 'మా కుటుంబమంతా టీడీపీనే. ఈ ఫొటోలు చూసి ఇంట్లోవాళ్లు ఇదేంటని అడుగుతున్నారు. బలవంతంగా కండువా వేశారని చెప్పుకోవాల్సి వస్తోంది' అంటూ పలువురు పేర్కొంటున్నారు. ఈ కండువాల గోలేంట్రా బాబూ అంటూ వీరంతా తలలు పట్టుకుంటున్నారు.

- రామకుప్పం

పోలింగ్ బూత్ @1400 ఓట్లు

● మీకు తెలుసా?



ఒక్కో పోలింగ్ కేంద్రం పరిధిలో ఉండేది గరిష్ఠంగా 1400 మంది ఓటర్లే. ఎందుకంటే.. ప్రతి కేంద్రంలో బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీప్యాట్‌లు ఈ మూడు ఒకదానికొకటి అనుసంధానంగా పని చేస్తాయి, ప్రస్తుతం వినియోగిస్తున్న ఈవీఎం (ఎలక్ట్రానిక్ ఓటింగ్‌మిషన్) లకు అనుసంధానంగా ఉండే వీవీ ప్యాట్ (ఓటర్ వెరిఫైవబుల్ పేపర్ అండ్ ట్రయల్)లో కాగితాన్ని పొందుపరుస్తారు. అది 1450 స్లిప్పులను మాత్రమే ముద్రిస్తుంది. బ్యాటరీతో పనిచేసే వీవీప్యాట్‌లోని డిస్‌ప్లేలో ఓటు ఎవరికి వేశామన్నది కనిపిస్తుంది. అందులో 50 వరకు కాగితం, స్లిప్పులు, ఓటింగ్‌రోజు మాక్‌పోలింగ్ ప్రక్రియకు వాడతారు. ఇదిపోను 1400 మంది ఓటర్లు మాత్రమే ఉండేలా చూస్తారు.

- చిత్తూరు కలెక్టరేట్

సీన్ 1



ఎక్కడ: రామకుప్పం మండలం రాజుపేట
ఎప్పుడు: ఈ ఏడాది ఫిబ్రవరి 26వ తేది
కార్యక్రమం: హంద్రీ-నీవా కుప్పం బ్రాంచి కాలువకు కృష్ణా జలాలు విడుదల ప్రారంభోత్సవం
ప్రారంభోత్సకులు: ముఖ్యమంత్రి జగన్

జగన్నాటకం!

నవ్వులపాలైన హంద్రీ-నీవా నీటి విడుదల డ్రామా

సీన్ 2



ఎక్కడ: రాజుపేట వద్ద హంద్రీ-నీవా కాలువకు నీటి విడుదల ప్రదేశం
ఎప్పుడు: ఫిబ్రవరి 27
కార్యక్రమం: సీఎం నీళ్లు విడుదల ప్రారంభోత్సవం చేయడానికి పెట్టిన గేటు తొలగింపు
నిర్వాహకులు: హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులు

సీన్ కట్ చేస్తే..



వారం రోజుల తర్వాత: నీళ్లు పారకనే ఎండిపోయిన హంద్రీ-నీవా కాలువ
ప్రత్యక్ష సాక్షులు: కుప్పం నియోజకవర్గ ప్రజలు
బట్టబయలు చేసింది : ప్రతిపక్షాలు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా.

అవును.. ఎన్నికల్లో లబ్ధికోసం ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి ఈ ఏడాది ఫిబ్రవరి 26వ తేదీన కుప్పం దాకా శ్రమించి హెలికాప్టర్‌లో వచ్చి మరీ రామకుప్పం మండలం రాజుపేట వద్ద ఆడిన హంద్రీ-నీవా కాలువకు కృష్ణా జలాలు విడుదల ప్రహసనం డ్రామా అని, తర్వాత రెండు మూడు రోజులకే తేలిపోయింది. వారం తర్వాత చూస్తే కాలువలో అసలు నీటిని వదిలిన జాడలే కనిపించలేదు. రామకుప్పం మండలంలో మూడు చెరువులకు నీటిని వదలామన్నారు కానీ, అవిప్పుడు ఎండిపోయి బోరుమంటున్నాయి. కుప్పం నియోజకవర్గ పరిధిలో కాలువ పొడవు 139 కిలోమీటర్లు, నింపాల్సిన చెరువులు 54. గమ్యస్థానం కుప్పం మండలంలోని పరమసముద్రం చెరువు. ప్రస్తుతం కాలువలో చుక్క నీరు లేని దుస్థితి.



నాటకమాడింది ఇలా

ఫిబ్రవరి 26వ తేదీన సీఎం జగన్ కుప్పం పర్యటనకు శాంతిపురం మండలం పరిధిలో బహిరంగ సభను నిర్వహించడమే కాక, హంద్రీ-నీవా కాలువ ప్రారంభోత్సవం పేరుతో నాటకానికి తెరలేపారు. పుంగనూరు రిజర్వాయర్‌నుంచి వి.కోటకు తీసుకొచ్చిన నీటిని అక్కడినుంచి నిరంతరాయంగా పంప్ చేయించి, నిల్వ ఉంచి ప్రారంభోత్సవం రోజున గేటును తెరచి ప్రారంభోత్సవం చేసినట్లు కలరింగ్ ఇచ్చారు. నీటి విడుదల పేరుతో జగన్ పైకెత్తిన ఇనుప గేటును మరుసటి రోజునే అధికారులు తరలించుకు వెళ్లి, విమర్శలు రావడంతో తిరిగి ఏర్పాటు చేయడం ఇది నాటకమనడానికి ప్రత్యక్ష నిదర్శనం. ఆ తర్వాత టీడీపీ శ్రేణులే కాదు, పలువురు సామాన్యులు కూడా ఎండిపోయిన కాలువలోకి వెళ్లి, వీడియోలు చేసి, ఫొటోలు దిగి, ధర్నాలు చేసి జగన్నాటకాన్ని ఎండగట్టారు. మొదట్లో ఏవో కుంటిసాకులతో వివరణలు ఇవ్వబోయిన రాష్ట్ర నీటిపారుదల శాఖ అధికారులు, స్థానిక హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులు తర్వాత కిమ్మనకుండా ఉండిపోయారు. వైసీపీ నేతలైతే కొన్నిరోజులు ప్రతి విమర్శలు చేసి, తర్వాత పూర్తిగా ఎండిపోయిన కాలువ కళ్లముందు కనిపిస్తుండడంతో ఏమనలేక కిక్కురుమనడం లేదు.

- కుప్పం

పుంగనూరుకు కేంద్ర బలగాలు

ఎన్నికల కమిషన్ ఆదేశాలతో పుంగనూరుకు ప్రత్యేకంగా కేంద్ర సాయుధ బలగాలు రానున్నట్లు తెలిసింది. సోమవారం ఎస్పీ మణికంఠ కేంద్ర బలగాలు బస చేయడానికి స్థానిక అంబేడ్కర్ భవన్‌లోని గదులు, సమావేశ మందిరాలు, మరుగుదొడ్లు, మౌలిక వసతులపై ఆరా తీసి, పరిశీలించారు. పుంగనూరులో స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార వైసీపీ నాయకులు ప్రత్యర్థులను నామినేషన్లు వేయకుండా దౌర్జన్యాలకు పాల్పడడం, నామినేషన్ పత్రాలు చించి వేయడం, బలవంతపు ఏకగ్రీవాలపై కేంద్ర ఎన్నికల సంఘానికి అధికంగా ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో పుంగనూరులో ప్రశాంతంగా పోలింగ్ జరగడానికి ఇప్పటికే పోలింగ్ కేంద్రాల్లో వీడియోగ్రఫీ, పటిష్ఠ పోలీస్ భద్రతకు చర్యలు తీసుకున్నట్లు సమాచారం, తాజాగా సుమారు 1000మంది కేంద్ర సాయుధ బలగాలు వస్తున్నట్లు తెలిసింది.

- చిత్తూరు కలెక్టరేట్

వేపంజేరి ● ముగిసిన చాప్టర్

మారుమూల గ్రామమైన వేపంజేరి కేంద్రంగా 1955లో నియోజకవర్గం ఏర్పాటైంది. ఇందులో గంగాధరనెల్లూరు, గుడిపాల, పెనుమూరు, పూతలపట్టు మండలాలతోపాటు చిత్తూరు మండలంలోని కొన్ని పంచాయతీలుండేవి. 1967 వరకు జనరల్.. తర్వాత రిజర్వు నియోజకవర్గంగా మారింది. 1955లో ఎస్పీ చెంగల్రాయనాయుడు (స్వతంత్ర), 1962లో జి.ఎన్.పట్టాభిరెడ్డి (స్వతంత్ర), 1967, 1972లో మునస్వామప్ప (కాంగ్రెస్), 1978లో బంగ్లా ఆర్ముగం (జనతా), 1983లో తలారి రుద్రయ్య (టీడీపీ), 1985, 1989లో గుమ్మడి కుతూహలమ్మ (కాంగ్రెస్), 1994లో ఆర్.గాంధీ (టీడీపీ), 1999, 2004లో కుతూహలమ్మ (కాంగ్రెస్) గెలుపొందారు. ఈమె మంత్రిగా, డిప్యూటీ స్పీకరుగా పనిచేశారు. 2009 నాటి నియోజకవర్గాల పునర్విభజనతో.. ఈ నియోజకవర్గంలోని గంగాధరనెల్లూరు, పెనుమూరు మండలాలు గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో.. పూతలపట్టు మండలం పూతలపట్టు నియోజకవర్గంలో కలిసింది. వేపంజరి అసెంబ్లీ సెగ్మెంటు హోదా కోల్పోయింది.

- గంగాధరనెల్లూరు

పుంగనూరు అరాచకాలకు కేరాఫ్‌గా మారింది. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వచ్చాక రాజకీయ ప్రత్యర్థులపై దౌర్జన్యాలు, దాడులు, పోలీసు కేసులు ఎక్కువయ్యాయి. భూ తగాదాలతో సామాన్యులూ ఇబ్బంది పడుతున్నారు. వీటినే ఈ ఎన్నికల్లో ఆయన ప్రత్యర్థులు రాజకీయ ప్రచారాస్త్రాలు వాడుకుంటున్నారు. కూటమి పార్టీల సహకారంతో గెలుపొందేందుకు టీడీపీ సర్వశక్తులూ ఒడ్డుతోంది.

- పుంగనూరు

పుంగనూరు వర్తమానం

పెద్దిరెడ్డి అరాచకాలే ప్రత్యర్థుల ప్రచారాస్త్రాలు

- ప్రశాంత పుంగనూరే వీరి ఎన్నికల నినాదం
- ఎంపీగా కిరణ్ పోటీతో బలపడుతున్న టీడీపీ



రాష్ట్రంలోని కీలక నియోజకవర్గాల్లో పుంగనూరు ఒకటి. ఈ ఎన్నికల్లో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి(వైసీపీ), చల్లా రామచంద్రారెడ్డి(టీడీపీ), రామచంద్రయాదవ్ (బీసీవై) తలపడుతున్నారు. 2009 వరకూ పుంగనూరు టీడీపీ కంచుకోట. టీడీపీకి పెద్దదిక్కుగా ఉన్న మాజీ ఎంపీ రామకృష్ణారెడ్డి కన్నుమూయడం, వీరి సొంత మండలం పెద్దపంజాణి పలమనేరులో కలవడంతో అమరనాథరెడ్డి అక్కడికి వెళ్లారు. పీలేరు నుంచి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పుంగనూరు రావడం.. టీడీపీలో క్రియాశీలకంగా ఉన్న నేతలు, పార్టీ శ్రేణులను బలవంతంగా తనవైపు తిప్పుకొన్నారు. దీంతో 2009 ఎన్నికల నాటికి చాలా బలహీనంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. అనంతరం 2014, 2019 ఎన్నికల్లోనూ గెలుపొందిన ఆయన.. రెండు పర్యాయాలు మంత్రి కావడంతో ప్రత్యర్థులను రాజకీయంగా అణగతొక్కారు. చాలామందిని నయాన భయాన తనవైపు తిప్పుకొన్నారు. మిగిలిన వారిపై దౌర్జన్యాలు, అరాచకాలు, పోలీసు కేసులతో వేధింపులు ఎక్కువయ్యాయి. రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా ఇక్కడ దాదాపు వెయ్యి మందిపై కేసులు నమోదు చేయించారు. మందలాది మందిని జైలుకు పంపారు. మరోవైపు టీడీపీ తరపున 2009, 2014లో వెంకటరమణరాజు.. 2019లో అనీషారెడ్డి పోటీ చేయగా.. ఈ ఎన్నికల్లో చల్లా రామచంద్రారెడ్డి బరిలో నిలిచారు. పెద్దిరెడ్డి సారథ్యంలో వైసీపీ శ్రేణులు పాల్పడిన అరాచకాలను ఈయన ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. వీటికి ప్రజల నుంచి సానుకూల స్పందన వస్తోంది. జనసేన, బీజేపీ జత కట్టడంతో టీడీపీ శ్రేణులకు మరింత ఉత్సాహాన్నిచ్చాయి. సూపర్ సిక్స్ పథకాలను జనంలోకి తీసుకెళ్తున్నారు. చల్లాబాబు గ్రామాల్లో తిరుగుతూ పలుచోట్ల వైసీపీ నేతలు, శ్రేణులను టీడీపీలో చేర్చుకుంటున్నారు.

ప్రజలను చైతన్యపరుస్తూ..

మంత్రి కుటుంబ కంపెనీ నిర్మిస్తున్న ప్రాజెక్టుల్లో ప్రభుత్వ నిబంధనలు పాటించలేదని, ఎన్జీటీ రూ.100కోట్లు జరిమానా విధించడం, ఇసుక, మట్టి తరలింపు, కొండలు, గుట్టలు కరిగిపోవడం, ప్రాజెక్టు నిర్వాసిత రైతులకు పరిహారం ఇవ్వకపోవడం, అక్రమకేసులు, దౌర్జన్యాలను ప్రత్యర్థులు ప్రచారాస్త్రాలుగా ఉపయోగిస్తున్నారు. ప్రశాంత పుంగనూరు, రౌడీయిజం అణచివేత నినాదాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. మంత్రికి చెందిన శివశక్తి డెయిరీ, పీఎల్ఆర్ ఫుడ్స్ పండ్ల పరిశ్రమల ద్వారా రైతులకు గిట్టుబాటు ధరల్లేక తీవ్రంగా నష్టపోతున్నారనే అంశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళుతున్నారు.

చల్లా బాబుపై వైసీపీ దాడులు

గతేడాది సోమల మండలం పెద్దఉప్పరపల్లెలో ఎన్నికల ప్రచారానికి వెళ్లిన చల్లా రామచంద్రారెడ్డిపై వైసీపీ శ్రేణులు రెండుచోట్ల దాడులకు పాల్పడి కార్లు ధ్వంసం చేశారు. గతేడాది ఆగస్టు 4న పుంగనూరు మీదుగా చంద్రబాబునాయుడు చిత్తూరు వెళుతున్న సందర్భంగా టీడీపీ శ్రేణులపై పోలీసుల లాఠీచార్జి వల్ల జరిగిన గొడవల్లో చల్లా బాబుతో పాటు 498మంది నాయకులు, కార్యకర్తలపై హత్యాయత్నం తదితర కఠినమైన సెక్షన్లతో కేసులు పెట్టి అరెస్ట్ చేశారు. పెద్దిరెడ్డికి వ్యతిరేకంగా వ్యవహరించిన 1000మందిపై పోలీసు కేసులు ఉండగా పలువురిపై రౌడీషీట్లు కూడా తెరిచారు. వీటన్నింటినీ ప్రచారాల్లో ప్రస్తావిస్తున్నారు.

బీసీవై నేత పోరాటం

పుంగనూరు బరిలో ఉన్న బీసీవై పార్టీ అధినేత రామచంద్రయాదవ్ పెద్దిరెడ్డి ఆగడాలపై బలంగా బాణాలను సంధిస్తున్నారు. తనపై జరిగిన హత్యాయత్నం, దౌర్జన్య దమనకాండను ఈ బీసీ నేత కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు నివేదించి వైప్లస్ కేంద్ర భద్రత పొందారు. పెద్దిరెడ్డిని లక్ష్యంగా పోరాడుతున్న తనపై 45కేసులు పెట్టించిన తీరును, నియోజకవర్గంలో అరాచకాలపై గళం విప్పుతున్నారు. పాడి, పండ్ల రైతులను మంత్రి దోపిడీ చేస్తున్నారని ప్రజలకు వివరిస్తున్నారు.

కిరణ్ పోటీతో కొత్త ఉత్సాహం


పెద్దిరెడ్డి దీర్ఘకాల ప్రత్యర్థి, మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి రాజంపేట బీజేపీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తుండటం పుంగనూరులో టీడీపీకి కలిసివస్తోంది. ఇది టీడీపీ శ్రేణులకు ధైర్యాన్నిస్తోంది. పుంగనూరు అభివృద్ధి మ్యానిఫెస్టోతో కూటమి నేతలు ముందుకు వెళుతున్నారు.

అన్నీ మంత్రికేనా?

నియోజకవర్గంలో చిన్న పని నుంచి పెద్ద కాంట్రాక్టు పనుల వరకు మంత్రి కుటుంబానికి చెందిన పీఎల్ఆర్ కంపెనీ చేస్తోంది. దీంతో వైసీపీలోని కాంట్రాక్టర్లకు పనులు లేకుండా పోయాయి. వీరంతా అసంతృప్తితో ఉన్నారు. కొందరికి మాత్రం భవన నిర్మాణ కాంట్రాక్టులు దక్కాయి.

హ్యాట్రిక్ కొట్టింది ఒక్కరే

● పలమనేరు చరిత్ర



తొలినాళ్లలో పంచాయతీగా ఉన్న పలమనేరు అంచెలంచెలుగా ఎదిగింది. 2004లో మున్సిపాలిటీగానూ, దశాబ్దం క్రితం పోలీసు సబ్‌డివిజన్‌గా, మూడేళ్ల కిందట రెవెన్యూ డివిజనల్ కేంద్రంగా రూపుదిద్దుకుంది. 1978 నుంచి ఈ నియోజకవర్గాన్ని 31 సంవత్సరాలు ఎస్సీలకు రిజర్వు చేశారు. ఇక్కడ నుంచి మూడుసార్లు టీడీపీ పక్షాన ఎన్నికైన డాక్టర్ పట్నం సుబ్బయ్య ఎన్టీఆర్, చంద్రబాబు నాయుడుల క్యాబినెట్‌లో పనిచేశారు. 2014లో వైసీపీ అభ్యర్థిగా గెలిచి రెండేళ్ల తరువాత టీడీపీ లో చేరిన అమరనాథరెడ్డి పరిశ్రమల శాఖ మంత్రిగా ప్రాతినిధ్యం వహించారు.

నియోజకవర్గం ఏర్పడిన సంవత్సరం: 1951
ఇప్పటిదాకా జరిగిన ఎన్నికలు: 15

వీరే ఎమ్మెల్యేలు

1952- రామబ్రహ్మం, (కాంగ్రెస్)
1955- ఎ. రత్నం, (కాంగ్రెస్)
1962 - కుసిని నంజప్ప(కాంగ్రెస్)
1967- టి.సి. రాజన్ (స్వతంత్ర పార్టీ)
1972- ఎం.ఎం. రత్నం(కాంగ్రెస్)
1978- ఎ రత్నం(కాంగ్రెస్)
1983- ఈ.ఆంజినేయులు (టీడీపీ)
1985,1989,1994- డాక్టర్ పట్నం సుబ్బయ్య (టీడీపీ)
1999- డాక్టర్ ఎం. తిప్పేస్వామి (కాంగ్రెస్)
2004- లలితకుమారి (టీడీపీ),
2009- అమరనాథరెడ్డి (వైసీపీ),
2014 - అమరనాథరెడ్డి (టీడీపీ),
2019- ఎం. వెంకటేగౌడ(కాంగ్రెస్)

మండలాలు : పలమనేరు, గంగవరం, వి.కోట,పెద్దపంజాణి,
మున్సిపాలిటీ : పలమనేరు

ఓటర్ల సంఖ్య: 2,66,739
పురుషులు: 1,32,020
స్త్రీలు: 1,34,719
ఇతరులు: 0

- పలమనేరు

శ్రీకాళహస్తి
సత్యవేడు

ఎమ్మెల్యే మధు అక్రమాలపై
అధికారులు విచారణ చేపట్టాలి: సుధీర్


సమావేశంలో మాట్లాడుతున్న బొజ్జల సుధీర్ రెడ్డి

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 22: శ్రీకాళహస్తి ఎమ్మెల్యే మధుసూదనరెడ్డి అక్రమాలపై అధికారులు వెంటనే విచారణ చేపట్టాలని ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్ రెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎన్టీఆర్ భవన్ సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రెండు వారాల క్రితం ఎమ్మెల్యే మధు అనుచరుడు హేమచంద్రారెడ్డి తనకు ప్రాణహాని ఉందంటూ ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. ముక్కంటి ఆలయంలో ఎమ్మెల్యే మధు కుటుంబసభ్యులతో కలిసి వెండి చోరీ చేసినట్లు, కరోనా సమయంలో మద్యం దుకాణాల్లో రూ.5 కోట్ల సరుకును చోరీ చేసి పది రెట్లు అధిక ధరకు అమ్ముకున్నట్లు హేమచంద్రారెడ్డి బాహాటంగా చెబుతున్నా అధికారులు విచారించడం లేదని నిలదీశారు. 24 గంటల్లోగా ఈ అంశాలపై విచారణ ప్రారంభించకపోతే ఎన్డీఏ కూటమి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని సుధీర్ రెడ్డి హెచ్చరించారు.

ముక్కంటి ఆలయంపై రాజకీయాలు తగదు


మీడియాతో మాట్లాడుతున్న అంజూరు శ్రీనివాసులు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 22: ముక్కంటి ఆలయంపై రాజకీయాలు చేయడం తగదని ధర్మకర్తల మండలి ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులు అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ముక్కంటి ఆలయంలో వెండి చోరీ జరిగినట్లు ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి ఫిర్యాదు తమకు అందలేదన్నారు. హేమచంద్రారెడ్డి అనే యువకుడు ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారని చెబుతున్నప్పటికీ అధికారుల నుంచి ఎలాంటి నోటీసు జారీ కాలేదన్నారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్ రెడ్డి ఆలయంపై రాజకీయాలు మానుకోవాలని హితువుపలికారు.

విద్యుత్ ఉద్యోగిపై అసత్య ప్రచారం తగదు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 22: విద్యుత్ ఉద్యోగి మునికుమార్ టీడీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారని అసత్య ప్రచారం చేయడం తగలదని ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో అన్నారు. రెండు వారాల క్రితం శ్రీకాళహస్తి పట్టణ శివారులోని పాలకొల్లు ప్రాంతంలో తాను ఎన్నికల ప్రచారం చేశానని, ఆ సమయంలో విద్యుత్ ఉద్యోగి మునికుమార్ ఇంటికి వెళ్లి ఓటు అభ్యర్థించానని వెల్లడించారు. ఆ సందర్భంగా తీసిన ఫొటోను చూపి కొందరు ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేయడం బాధాకరమన్నారు.

బీసీల ఆర్థికాభివృద్ధే టీడీపీ లక్ష్యం


బీసీ నాయకులతో బొజ్జల బృందమ్మ

తొట్టంబేడు, ఏప్రిల్ 22: బీసీలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే టీడీపీని గెలిపించుకోవాలని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి తల్లి బొజ్జల బృందమ్మ అన్నారు. మండలంలోని చియ్యవరం గ్రామంలో బీసీలతో ఆత్మీయ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వంలో బీసీలకు కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు మంజూరు చేసిందన్నారు. రానున్న టీడీపీ ప్రభుత్వంలో 18సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు రూ.1500 నగదు, ప్రతి ఇంటికీ మూడు గ్యాస్‌సిలిండర్లు, చదువుకునే ప్రతి బిడ్డకూ సంవత్సరానికి రూ.15వేల నగదు ఇవ్వనున్నట్లు తెలిపారు. టీడీపీకి ఓటు వేసి సుధీర్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతినాయుడు, మండల అధ్యక్షుడు గాలి మురళీ నాయుడు, మాజీ జడ్పీటీసీ వెంకటాచలం, ఎస్సీవీ కిరణ్, హరిబాబు, సునీల్, భాస్కర్‌నాయుడు, చెన్నురాఘవులు, బాలాజీనాయుడు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రిని కలిసిన సుధాకర్



తొట్టంబేడు, ఏప్రిల్ 22: కేంద్ర పశుసంవర్ధక శాఖ మంత్రి ఎల్.మురుగన్‌ను టీవీ సీరియల్ ప్రొడ్యూసర్ పల్లమాల సుధాకర్ మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం తిరుపతిలో మంత్రిని కలిసిన ఆయన పుష్పగుచ్ఛం అందజేశారు.కార్యక్రమంలో టీడీపీ తెలుగు యువత మాజీ రాష్ట్ర కార్యదర్శి బీజే ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించండి

తొట్టంబేడు, ఏప్రిల్ 22: రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించాలని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కోట వినుత అన్నారు. మండలంలోని పెద్దసింగమాల, గాజుచేను, గురుకులపాళెం, కొమ్మనగుంట గ్రామాల్లో సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎన్డీఏ కూటమి అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు పేటచంద్రశేఖర్, టీడీపీ, జనసేన నాయకులు తేజ, శ్రీను, విజయ్‌కుమార్, గోవర్ధన్ నాయుడు, గురప్ప నాయుడు తదితరులు పాల్గొన్నారు.


ప్రచారం నిర్వహించిన కోట వినుత

24న ముక్కంటి ఆలయ హుండీ లెక్కింపు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 22: ముక్కంటి ఆలయ హుండీని ఈనెల 24వ తేదీన లెక్కించనున్నట్లు డిప్యూటీ ఈవో ఏకాంబరం సోమవారం తెలిపారు.

బంగారు గాజుల వితరణ

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 22: ముక్కంటి ఆలయానికి తిరుపతికి చెందిన హరికృష్ణ రూ.1.30లక్షల విలువైన రెండు బంగారు గాజులను వితరణ చేశారు. సోమవారం ఆలయ పరిపాలన భవనంలో ఈవో నాగేశ్వరరావుకు అందజేశారు. దాతలను సత్కరించి ధన్యవాదాలు తెలిపారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

తొట్టంబేడు, ఏప్రిల్ 22: బీఎన్‌కండ్రిగ మండలం నుంచి శ్రీకాళహస్తికి 54మద్యం బాటిళ్లను తీసుకెళుతున్న మంచూర్ ను తొట్టంబేడు మండలంలోని తంగేళ్లపాళెం క్రాస్ వద్ద అరెస్టు చేసినట్లు తొట్టంబేడు ఎస్ఐ రాఘవేంద్ర తెలిపారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

తొట్టంబేడు, ఏప్రిల్ 22: మండలంలోని తాటిపర్తి, బసవన్నగుంట పోలింగ్ కేంద్రాలను తహసీల్దారు శివరామసుబ్బయ్య ఎంపీడీవో ఐజాక్ ప్రవీణ్ సోమవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, వీల్ ఛైర్లు తదితర వసతులు అందుబాటులో ఉన్నాయా లేదా అని బీఎల్‌వోలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ తరుణాక్షిరెడ్డి, వీఆర్వోలు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

వైసీపీ అంతం... ప్రజల పంతం: సుధీర్ రెడ్డి


ఎన్నికల ప్రచారంలో ఎన్డీఏ కూటమి నేతలు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 22: వైసీపీ భూతాన్ని అంతం చేయడానికి అన్ని వర్గాల ప్రజలు పంతం పట్టారని శ్రీకాళహస్తి ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్ రెడ్డి అన్నారు. పట్టణంలోని 18,20,21,22వ వార్డుల్లో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కూటమి నేతలకు స్థానికులు అఖండ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ... శ్రీకాళహస్తిలో వైసీపీని తరిమికొట్టేందుకు ప్రజలంతా స్థిర నిశ్చయంతో ఉన్నారని స్పష్టం చేశారు. సైకిల్ గుర్తుపై పోటీ చేస్తున్న తనను ప్రజలు ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత అమలు చేయబోయే సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు విజయ్ కుమార్, ఉమేష్ రావు, సుమతి తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని ఎన్టీఆర్ భవన్‌లో సోమవారం ఏఐఎస్ఎఫ్ నాయకుడు సురేష్ ఆధ్వర్యంలో పలువురు యువకులు టీడీపీలో చేరారు. వారికి బొజ్జల సుధీర్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

జ్యోతినగర్‌ను దత్తత తీసుకుంటా: రిషితారెడ్డి

రేణిగుంట: పట్టణంలోని జ్యోతినగర్ ప్రాంతాన్ని దత్తత తీసుకుంటున్నానని ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి రిషితారెడ్డి తెలిపారు. సోమవారం సాయంత్రం పంచాయతీ పరిధిలోని కులం, అన్నయ్‌నగర్, జ్యోతినగర్ ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. టీడీపీ ప్రాంత కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మురళి, రామమూర్తి, బాబు నేతృత్వంలో 50 కుటుంబాల వారు పార్టీలో చేరారు. వారికి రిషితారెడ్డి కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ప్రాంతంలో వర్షం వస్తే వర్షపునీటితో పాటు డ్రైనేజీ ఇళ్లలోకి వస్తోందని, అలాగే మురుగుకాలువలు, సిమెంటు రోడ్లు నిర్మించకుండా వైసీపీ నాయకులు నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మెహబూబ్‌బాషా, పుష్పనాథన్, ఎంజీరెడ్డి, మణి, నరసింహులు, మనోహర్, కిషోర్, మేరి, చైతన్య, దినేష్, కన్నన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


టీడీపీలో చేరిన వారితో బొజ్జల రిషితారెడ్డి

ఎన్డీఏ కూటమిదే విజయం: వరప్రసాద్



కలెక్టర్ ప్రవీణ్‌కుమార్‌కు నామినేషన్ పత్రాలను సమర్పిస్తున్న వరప్రసాదరావు - ర్యాలీలో కూటమి నేతలు, కార్యకర్తలు

తిరుపతి,(ఉపాధ్యాయనగర్) ఏప్రిల్ 22: వచ్చే ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి విజయం సాధిస్తుందని తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు అన్నారు. సోమవారం తిరుపతి ఎంపీ అభ్యర్థిగా వరప్రసాదరావు నామినేషన్ దాఖలు చేశారు. కేంద్రమంత్రి మురుగన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు నరసింహయాదవ్, జనసేన నాయకుడు హరిప్రసాద్, బీజేపీ నాయకుడు నవీన్‌గుప్తాతో కలసి ఆయన నామినేషన్ పత్రాలను జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్‌కు అందజేశారు. అంతకు ముందు బాలాజీ కాలనీ నుంచి ర్యాలీ ప్రారంభించారు. అక్కడ మహాత్మా జ్యోతిరావుఫూలే విగ్రహానికి నివాళి అర్పించారు. అక్కడి నుంచి భారీ ర్యాలీ గోవింద రాజుస్వామి ఆలయం సర్కిల్ మీదుగా ఆర్టీసీ బస్టాండ్ వరకు సాగింది. అక్కడ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ ర్యాలీతో బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనడంతో కార్యకర్తల్లో జోష్ కన్పించింది. నామినేషన్ అనంతరం ఆయన మాట్లాడుతూ... తిరుపతి ఎంపీ స్థానంలో తాను విజయం సాధించబోతున్నట్లుగా ప్రకటించారు. జగన్ అవినీతి, దౌర్జన్యాలే తనకు విజయాన్ని అందిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. తనపై నమ్మకంతో టిక్కెట్ కేటాయించిన బీజేపీ అధిష్ఠానానికి సహకరిస్తున్న టీడీపీ, జనసేన నాయకులకు కృతజ్ఞతలు తెలుపు కుంటున్నానన్నారు. ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండి అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు, శ్రీకాళహస్తి, నగరి టీడీపీ అభ్యర్థులు బొజ్జల సుధీర్‌రెడ్డి, గాలి భానుప్రకాష్‌రెడ్డి, టీడీపీ నాయకులు పనబాక కృష్ణయ్య, బీజేపీ నాయకులు కోలా ఆనంద్, చంద్రప్ప, జనసేన నాయకులు వనిత తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల హవా


బి.పల్లవి(589), వై.రమ్యశ్రీ(583), తేజేశ్వర్(576), కె.అనిత(565)

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 22: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రతిభ చూపారు. శ్రీకాళహస్తి పట్టణంలోని కసాగార్డెన్‌లో ఉన్న జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి మంది విద్యార్థులు పరీక్ష రాయగా అందరూ ఉత్తీర్ణత సాధించారు. అలాగే పట్టణ శివారులోని రాజీవ్ నగర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాల నుంచి మంది విద్యార్థులు పరీక్ష రాయగా అందరూ ఉత్తీర్ణత సాధించారు.

కేవీబీపురం: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 95శాతం ఉత్తీర్ణత సాధించారు. అంజూరు, కోవనూరు, కాళంగి, ఆదర్శ పాఠశాల, కస్తూర్బా పాఠశాలల్లో వందశాతం ఉత్తీర్ణత నమోదైంది. ఆదర్శ పాఠశాల విద్యార్థి చారుమతి 590మార్కులతో టాపర్‌గా నిలిచింది.

వరదయ్యపాళెం: మండలంలోని పాండూరు, సంతవేలూరు, గోవర్ధనపురం, కారిపాకం జడ్పీ ఉన్నత పాఠశాలల విద్యార్థులు పదవ తరగతి ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించారు. వరదయ్యపాళెం పాఠశాలకు చెందిన బి.పల్లవి 589 మార్కుల టాపర్‌గా నిలిచింది.

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని చల్లమాంబపురం పాఠశాల విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించారు. కల్లివెట్టు ఉన్నత పాఠశాలకు చెందిన నవ్య 578 మార్కులతో టాపర్‌గా నిలిచింది.

నాగలాపురం: మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో 96శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు ఎంఈవో బాబయ్య తెలిపారు. నాగలాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎం.తేజేశ్వర్(576) మార్కులతో మండల టాపర్‌గా నిలిచాడు.

పిచ్చాటూరు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 96శాతం ఉత్తీర్ణత సాధించారు. వెంగళత్తూరు జడ్పీహెచ్ఎస్ విద్యార్థి జ్యోతి(579) మార్కులు, పిచ్చాటూరు జడ్పీహెచ్ఎస్ విద్యార్థి సోమశేఖర్(578) మార్కులు సాధించారు.

తొట్టంబేడు: మండలంలోని బోనుపల్లి, కాసరం, చియ్యవరం, పెద్దకన్నలి పాఠశాలు 100శాతం ఉతీర్ణత నమోదు చేశాయి. బోనుపల్లి పాఠశాల విద్యార్థి అనిత 565 మార్కులతో టాపర్‌గా నిలిచింది.

సత్యవేడు: మండలంలో 93శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు ఎంఈవో రవి వెల్లడించారు. అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల, మహాత్మ జ్యోతిబాఫూలే బాలురు గురుకుల పాఠశాల, మాధవన్‌పాళెం జడ్పీ హైస్కూలు, పీపురం జడ్పీ హైస్కూలులో వంద శాతం ఉత్తీర్ణత ఉత్తీర్ణత నమోదైంది. బాలికల గురుకుల పాఠశాల విద్యార్థి వై.రమ్యశ్రీ 583 మార్కులతో టాపర్‌గా నిలిచింది.

రేణిగుంట: మండలంలో 1,065మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 957మంది ఉత్తీర్ణత సాధించారు. రేణిగుంట జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి సౌమ్య 583 మార్కులు, తారకరామా నగర్ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి అలీషా 580 మార్కులు సాధించారు.

ఏర్పేడు: మండలంలో 483మంది పదో తరగతి పరీక్షలు రాయగా 433మంది ఉత్తీర్ణత సాధించారు. బండారుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన జనని 592 మార్కులతో మండల టాపర్‌గా నిలిచింది.

జగన్ పాలనకు చరమగీతం పాడాలి: ఆదిమూలం


పుత్తేరిలో ప్రచారం నిర్వహిస్తున్న ఆదిమూలం

బుచ్చినాయుడుకండ్రిగ, ఏప్రిల్ 22: జగన్ పాలనకు చరగీతం పాడాలని సత్యవేడు టీడీపీ అభ్యర్థి కోనేటి ఆదిమూలం పిలుపునిచ్చారు. మండలంలోని పుత్తేరి, ఏ.పార్లపల్లి, రెడ్డిగుంటబాడవ, పట్టాభిగిరిజన కాలనీ, ఆలత్తూరు గ్రామాలలో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో సంక్షేమం పేరుతో కోట్లాది రూపాయలు దోచుకున్నారని ఆరోపించారు. ఎన్డీఏ కూటమి ద్వారా చంద్రబాబునాయుడు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తారని చెప్పారు. అవినీతి ప్రభుత్వాన్ని ఇంటికి పంపాలంటే తెలుగుదేశం, జనసేన, బీజేపి అభ్యర్థులను అత్యధిక మెజారీటీతో గెలిపించాలని అన్నారు. శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే ఎస్‌సీవీ నాయుడు మాట్లాడుతూ చంద్రబాబునాయుడు సూపర్ సిక్స్ పథకాలతో ప్రజల పూర్తిస్థాయిలో సంక్షేమ పథకాలు అందజేస్తారని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సుధాకర్ నాయుడు, కన్నయ్యనాయుడు, మాజీ ఎంపీపీ బట్టా రమేష్‌యాదవ్, మధునాయుడు, శ్రీనివాసులు, గోపి, రాజేంద్ర, వెంకటేశ్వర్లు, సురేష్, గురువయ్య, రమణయ్య, బీజేపీ మండల అధ్యక్షుడు హరిబాబురెడ్డి, తేజ జనసేన నాయకులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ పేలి ముగ్గురికి తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న జ్యోతి, మమత

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 22: గ్యాస్ సిలిండర్ పేలి ముగ్గురు తీవ్రంగా గాయపడిన ఘటన సోమవారం రాత్రి శ్రీకాళహస్తి పట్టణంలో చోటు చేసుకుంది. కొండమెట్టు ప్రాంతానికి చెందిన గణేష్ బాబు(32) పూల అలంకరణ చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. ఆయన భార్య జ్యోతి (28) గృహిణి. గణేష్ సోదరి మమత(34)వారితో పాటే నివాసం ఉంటుంది. సోమవారం రాత్రి జ్యోతి ఇంట్లో వంట చేస్తుండగా గ్యాస్ సిలిండర్ ఒకసారిగా పేలింది. అదే సమయంలో మిగతా ఇద్దరు టీవీ చూస్తున్నారు. ఈ ఘటనలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతిలో రుయాకు రిఫర్ చేశారు. వన్‌టౌన్ ఎస్ఐ అరుణ ప్రమాద ఘటనపై విచారణ చేస్తున్నారు.

వేడుకగా పెద్దకొట్టాయి ఉత్సవం

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 22: శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం పెద్ద కొట్టాయి ఉత్సవం ఘనంగా జరిగింది. ఆలయంలోని అలంకార మండపంలో స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను సుగంధ పరిమళభరిత పుష్పమాలలు, స్వర్ణాభరణాలతో అలంకరించారు. అక్కడినుంచి ఆలయంలోని కోట మండపం వద్ద పగడ చెట్టు కింద సాయంత్రం స్వామి అమ్మవార్ల ఉషోమూర్తులను కొలువు తీర్చారు. వట్టివేర్లతో చలువ వాతావరణం కల్పించారు. అనంతరం విశేష అభిషేకాలు పూజలు నిర్వహించారు. ధూప దీప నైవేద్యాలను సమర్పించి తర్వాత తిరిగి ఆలయంలోని అలంకార మండపంలో కొలువుదీర్చారు.

మృత్యుంజయ స్వామికి విశేష పూజలు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 22: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మృత్యుంజయ స్వామి విశేష అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సోమవారం పురస్కరించుకొని ముక్కంటి ఆలయంలోని మృత్యుంజయ సన్నిధిని అర్చకులు శుద్ధి చేశారు. అనంతరం భక్తుల నుంచి సంకల్పం స్వీకరించారు. వివిధ పూజా ద్రవ్యాలతో శాస్త్రోక్తంగా అభిషేకించారు. వేదమంత్రాలతో విశేష పూజలు నిర్వహించి దూప, దీప, నైవేద్యాలు సమర్పించారు.

పుత్తూరు వార్తలు

రావణేశ్వర వాహనంపై అగస్త్యేశ్వరస్వామి




నారాయణవనం, ఏప్రిల్ 22: మండలంలోని సముదాయం గ్రామంలో ఉన్న మరగదవల్లీ సమేత అగస్త్యేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి స్వామివారు రావణాసురుడిని వాహనంగా చేసుకుని పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామివారికి నిత్యపూజా కైంకర్యాలు చేపట్టారు. అనంతరం ఉత్సవ మూర్తులను తిరుచ్చి వాహనంపై శివగామీ సమేతుడై నటరాజస్వామి గ్రామోత్సవం విహరించారు. సాయంత్రం విశేష పూజల అనంతరం, మేళతాళలు, మంగళవాయిద్యాలు, భక్తుల కోలాటల నడుమ స్వామివారిని రావణేశ్వర వాహనంపై గ్రామవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయాధికారి నాగరాజు, ఏఈవో పార్థసారధి, సూపరిటెండెంట్ ధర్మయ్య, ఆర్జితం అధికారి భరత్, ఆలయ అర్చకులు రమేష్ గురుకుల్ పాల్గొన్నారు.

వైసీపీకి బుద్ధి చెప్పండి


ఏఎంపురంలో ప్రచారం చేస్తున్న క్షత్రియ సంఘ నాయకులు

వడమాలపేట, ఏప్రిల్ 22: ఒక్కచాన్స్ అంటూ ప్రజలను మోసం చేసిన వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని చిత్తూరు పార్లమెంటు టీడీపీ ఉపాధ్యక్షుడు మణిరాజు అన్నారు. సోమవారం క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో ఏఎం పురంలో టీడీపీ మేనిఫెస్టోను వివరిస్తూ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. నగరి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్‌ను గెలపించాలంటూ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఎన్డీఏ కూటమి అధికారం చేపడితేనే రాష్ట్రం అభివృద్ధి బాటలో పయనిస్తుందని అన్నారు. కార్యక్రమంలో క్షత్రియ సంఘం నాయకులు అబ్బురాజు, రామ్మోహన్ రాజు, సుబ్రహ్మణ్యం రాజు, రాజేంద్రరాజు, జయదేవ రాజు, రఘురాజు, సీపీ కృష్ణమరాజు, బాబురాజు, కోనేటి రవిరాజు, వెంకటేష్, శ్యామ్, మణి తదితరులు పాల్గొన్నారు.

పది ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ


కస్తూరి, మార్లియా

పుత్తూరు, ఏప్రిల్ 22: పుత్తూరు మండలంలో 1256 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలు రాయగా 1164మంది ఉత్తీర్ణత(93శాతం) సాధించారని ఎంఈవో తిరుమలరాజు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో 89 శాతం ఉత్తీర్ణతను సాధించారని చెప్పారు. పుత్తూరు బాలికల పాఠశాల విద్యార్థి మార్లియా 582 మార్కులతో ప్రథమ స్థానం, రాచపాలెం విద్యార్థులు నితీష్, రేవతి 578 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచారు.

వడమాలపేట: మండలంలో 332 మంది పదవ తరగతి పరీక్షలు రాయగా 303 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. సీతారామపురం ఉన్నత పాఠశాల వంద శాతం ఉత్తీర్ణత సాధించింది.

నారాయణవనం: స్థానిక బాలికల హైస్కూల్ విద్యార్థినులు కస్తూరి 590 మార్కులతో ప్రథమ స్థానం, తాఫిక 589 మార్కులతో ద్వితీయ స్థానం, 561 మార్కులతో సోనాలియా తృతీయ స్థానంలో నిలిచారు.